
REGISTERED NO. M. 1287.



రిజిష్టరునంబరు ఎమ్ 1287.

శ్రీ

# ఆంధ్రసేవ.

యను

విద్యావిషయప్రధానమగు

మాసపత్రిక.

ప్రతిమాసాదిని వెలువడును.

శ్రీలనొప్పంగు సత్కళలశేషము నాంధ్రమునందుఁ దెల్పఁగాఁ
జాలినయట్టి ప్రౌఢ లనిశంబు శ్రమింపడి జాణఁజేయఁ బాఁ
దేలిన పత్రికాంగన యిదే చనుదెంచెడు నిష్ఠధాత్రియై
శీలముగల్గు నాంధ్రులకు సేవయొనర్పఁగ నాంధ్రసేవనాన్.

ఇది

శ్రీరాజా రావు వేంకట కుమార మహీపతి
సూర్యరాట్ప్రభువరేణ్యుని రాజధానియగు
శ్రీపిఠాపురమున

నున్న

అద్దంకి మాధవశాస్త్రిగారి యాధిపత్యమున
శ్రీవిద్వజ్జనమనోరంజనీముద్రాక్షరశాలయందు
ముద్రింపఁబడి ప్రకటింపఁబడును.

1917.

కాపీరైటు.

సంవత్సరమునకుఁ జందా రు 3-0-0 లు.
మూఁడురూపాయలు మాత్రము.

# విషయసూచిక.

1. స్వవిషయము.

2. గ్రంథస్వీకారము.

3. బొంబాయి.

4. శాస్త్రాంశములు. (Science Notes) } మ. రా. రా. శ్రీ పాలగుమ్మి సాంబమూర్తిగారు బి. ఏ. ఎల్. టి. రాజమండ్రి.

5. మానవధర్మములు.

6. గృహనిర్మాణవస్తువులు—మ. రా. రా. శ్రీ హరిండి వేంకటరమణయ్యగారు బి. ఏ. బి. సి. ఇ. కోయంబత్తూరువ్యవసాయకళాశాల.

7. వ్యవసాయము—ఒకవ్యవసాయశాస్త్రజ్ఞుఁడు.

8. వసుచరిత్రవిమర్శనము—మ. రా. రా. శ్రీ దంతుర్తి సుబ్బారాయశాస్త్రిలవారు, పెద్దాపురమున వింపనుమహాపాఠశాలలో సంస్కృతాధ్యాపకులు.

9. గ్రహములు—మ. రా. రా. శ్రీ జొన్నలగడ్డ మల్లపరాజుగారు బి. ఎ. బీ. సి. ఇ. అమలాపురము.

10. విజనసదనము—మ. రా. రా. శ్రీ కవుకొండల వేంకటరావుగారు బి. ఎ. బి. ఎల్ రాజమండ్రి.

# కృతజ్ఞతాపూర్వకనమస్కారములు.

ఇప్పుడు ప్రకటింపఁబడుచున్న యాంధ్రసేవఁబోలువిద్యావిషయప్రధానపత్రికల యావశ్యకత కిప్పటియాంధ్రమండలముయొక్క మహోత్సాహమే కారణము గావున నాంధ్రమండలికిఁ గృతజ్ఞతఁ బత్రికాముఖమునఁ జూపుచున్నాము. ఒత్తుడు గలిగించితిమని విసవుఁజూపక పనులనుండి తెఱిపిచేసికొని వెట్టిసేవయని తిట్టక సంతోషపూర్వకముగ నాంధ్రులయందలియనురాగమున వ్యవధిలేనికాలములయందు వ్రాసి వాత్సల్యమున నీపత్రికకు వ్యాసములొసంగినవారి కీప్రకటనమున మిగులఁ గృతజ్ఞతఁ జూపుచున్నాము. ఈపత్రికయొక్క పురోభివృద్ధి విద్వన్మణు లిఁక నాంధ్రమున నంపెడు వ్యాసముల నాశ్రయించియుండును గావున నిఁక వ్యాసములనంపెడుమహనీయులయెడఁ గృతజ్ఞతగలిగి యుందుము. ఆంధ్రభాషావ్యాప్తిఁ గోరి పాఠశాలలందు మాతృభాషనుగూడ ప్రధానముగ నొనర్చి గొప్పతరగతులయందుఁగూడ మాతృభాషయావశ్యకముగఁ జదువవలయునని చట్టముల నేర్పరుపఁ బ్రయత్నములొనర్చువిద్యావ్యాపకవిద్వన్మండలీకార్యనిర్వాహకులకును స్వభాషాభిమానము గలప్రభువరేణ్యులకును గృతజ్ఞుల మయ్యెదము. అవ్యవధికాలమున వ్రాయుటవలనఁ గలిగినగ్రంథకర్తలపొరబాటులకును విలేఖకులకొందరలచేతఁ గలిగినయపభ్రంశములకును ముద్రణమునందలి దోషలేశంబులకు నాంధ్రులు క్షమగలిగియుండవలయునని కోరుచున్నాము. 2 వసంచిక మిగుల నాలస్యముగఁ బంపవలసివచ్చుటవలన నీసంచిక కొంచెమాలస్యముగ బయలువెడలినది. ఆలస్యదోషము కొలఁదిమాసములవఱకుఁ గలుగునేని క్షమగలిగియుండ నాంధ్రులు ప్రార్థితులు. క్షమాన్వితులగునాంధ్రులకుఁ గృతజ్ఞుల మయ్యెదము. పత్రికకు నిలబాటుగలుగువఱకు చిన్నచిన్నయాతంకములచే సంచికలించుక యాలస్యముగ బయలువెడలినను పత్రికాధిపతికి మాయయొనర్చునుద్దేశము నారోపింపవలదు. సంవత్సరమునకు నొసంగఁబడుచందా పన్నెండుసంచికలవఱకు నిలుచును. పన్నెండు సంచికలు జేరినవెనుకఁగాని యొకసారి చందాయిచ్చినవారివలన దిరిగి చందావసూలు చేయఁబడదు. ఇఁక ముందాలస్యముగ సంచికలెప్పుడేని బయలువెడలునెడ మన్నించెడుశాంతచిత్తులయెడఁ గృతజ్ఞతఁ జూపెదము. ఆంధ్రభాష యభివృద్ధినొందు నటుల నీపత్రికాప్రకటనమున కనుజ్ఞ యిడినదొరతనమువారియుత్కృష్టతకుఁ గృతజ్ఞులము. సుజనులెల్లరు దోషంబులఁ బాటింపక గుణంబుల గ్రహియింపవలయును.

అద్దంకి మాధవశాస్త్రి,
ఆంధ్రసేవాపత్రికాపతి.

శ్రీ

విద్యావిషయప్రధానమగు '<u>నాంధ్రసేవ</u>' యనుపత్రిక జ్ఞానప్రబోధకముగ నాంధ్రమునఁ బ్రతిమాసమున నెనుబదిపుటలకు లోనుగ నలువదిపుటలకుఁ బైనఁ బ్రచురింపఁబడుచున్నది. ఇందు వ్యాసముల వ్రాయువారు తఱచుగ నాంగ్లేయసంస్కృతాంధ్రములయందుఁ బ్రవీణులుగ నుందురు. ఈవ్యాసములు మహాపురుషులచరిత్రములు రాజ్యాంగనిర్మాణము మున్నగువానిఁ గుఱించియు, నాధునికశాస్త్రములఁ గూర్చియు. భాషావిషయమునఁ గావ్యములు మొదలగువానిఁ గూర్చియుఁ బండితపామర జనరంజకముగ వ్రాయఁబడును. జ్ఞానప్రబోధకముగఁ గూడ వ్రాయఁబడుటచేతఁ జదువరు లించుక శ్రమపడినయెడల విశేషఫలంబు హస్తగతముఁ జేసికొందురు. ఈపత్రికఁ జదువఁజదువఁ జదువరుల కానంద మతిశయముగఁ గూర్చునటులఁ గూర్పఁబడును. అపూర్వములును, నముద్రితములును, హృద్యపద్యాత్మకములు నగు సంస్కృతాంధ్ర ప్రబంధములు గూడ లభించిన నిందుఁ బ్రకటింపఁబడును.

విద్యాభోజు లగుప్రభువరేణ్యు లెల్లరు దీనికి రాజపోషకులుగ నుండఁ బ్రార్థితులు. దీనివలన జ్ఞానము వడయఁగోరువారును, దీనియందలి విషయముల నాంధ్రమండలమున వ్యాపింపఁజేయఁ దలఁచువారును, దీనిఁ బోషింపఁదలఁచు నితరులును దీనికి శాశ్వతముగఁ జందాదారులుగ నుండవలయునని విన్నవించికొనుచున్నారము. విద్వన్మణులు వ్యాసముల నంపుదురేనిఁ గృతజ్ఞతాపూర్వకముగ నందికొని యిందులసభ్యుల యనుమతివడసినయెడల నిందావ్యాసములు ప్రకటింపఁబడును. అటుల వీలులేనియెడలఁ గృతజ్ఞతతో వ్యాసముల నంపెడువారికిఁ దిరుగ వానినంపెదము. ఆంధ్రులెల్లరు నీపత్రికకు బహువిధములఁ దోడ్పడఁగోరెదము.

ఈపత్రికకుఁ జందా సంవత్సరమునకు (12 సంచికలకు) తపాలాఖర్చులుగాక } రు 3—0—0 లు మాత్రము.

విడిగఁ బ్రతిసంచికకు (తపాలాఖర్చులుగాక) రు 0-6-0 లు.

ప్రస్తుతము కొలఁదిప్రతులే ప్రచురింపఁబడుటచేత వలయువారు శీఘ్రముగ

'అద్దంకి మాధవశాస్త్రిగారు,

'ఆంధ్రసేవా' పత్రికాధిపతి,

పిఠాపురము, గోదావరిజిల్లా'

అని వ్రాయవలయును.

రిజష్టరునంబరు ఎమ్. 1287.

శ్రీ

# ఆంధ్రసేవ

మాసపత్రిక.

ప్రతిమాసాదిని వెలువడును.

ప్రథమ వర్షము | సెప్టెంబరు 1917. | సంచిక 3.

శ్లో. వితరతిగురుఃప్రాజ్ఞే విద్యాం యథైవ తథాజడే
నచఖలు తయోర్జ్ఞానే శక్తింకరోత్యపహంతివా
భవతిచతయో ర్భూయాన్భేదః ఫలం ప్రతితద్యథా
ప్రభవతి శుచిర్బింబగ్రాహే మణిర్నమృదాదయః.

(ఉత్తరరామచరితనాటకము.

## శ్రీమదాంధ్రసేవాపత్రికావిషయము.

ఆంధ్రభాషాభిజ్ఞులారా!

ఈపత్రిక ప్రారంభింపఁబడినవేళావిశేష మెట్టిదోకాని మొదట నుండియు నాతంకభయము కలుగుచునే యున్నది. మొదటిసంచిక జూన్ నెలలోఁ బంపఁదలంచికొనియుంటిమి కాని కొన్నివ్యవహారధర్మ ములంబట్టి జూలైనెలలోఁ గాని పంపవీలులేకపోయినది ఆగష్టునెలయం దారంభమున బయలువెడలవలసినసంచిక వెడలునో వెడలక యింట నే యుండిపోవలసివచ్చునో యని యలజడి గలిగించి యెట్టకేలకు ద్వి

తీయవిఘ్నము కాకుండ మాసాంతములోపల బయలువెడలినది. కాలాతిక్రమణదోష మిసుమంత గలిగినఁ గలుగుఁగాక యిఁక పత్రిక కొనసాగ దనుభయము పోయినది. కొంతకాల మిటులఁ జరిగినయెడల విహితకాలము దాఁటకుండఁ బ్రతిసంచికయు బయలువెడలుటకూడఁ దటస్థించును. ఇటుల నీపత్రికావ్యాప్తి చక్కఁగ జరుగుటకు నాంధ్రులెల్లరుఁ జూపెడుసహాకారితయే యాధారము. ఇప్పటికి సంచికలు పంపఁబడునపుడు తిరుగఁగొట్టక యీపత్రికయందును నాంధ్రాభివృద్ధియందు నభిమానముగలుగుటవలననో స్వవిద్యాప్రభావముననో సాంతముగఁ జదువుకొఱకు వానిని గ్రహియించినవారలకెల్ల మాకృతజ్ఞతాపూర్వకనమస్కారములు. ఆంధ్రసేవ దినదినాభివృద్ధి గలిగి చిరకాలము విహితకృత్యముల నెఱవేర్చుఁగాత. ఆంధ్రసంఘము తత్కార్యనిర్వహణంబున మిగుల సౌఖ్యమునంది యుచ్చపదవి నందెడుఁగాత.

మంగళం మహత్ శ్రీ శ్రీ శ్రీ.

---

గ్రంథస్వీకారము :— పెద్దాపురమున మిషనుమహాపాఠశాలయందు సంస్కృతాధ్యాపకులగు బ్రహ్మశ్రీ దంతుర్తి సుబ్బరాయశాస్త్రులవారిచే రచింపఁబడిన రు 0-4-0 లు వెలగలదేశోపదేశము, రు0-1-0 వెలగలభావశతకము నను రెండుపొత్తములును రాజమహేంద్రవరనివాసులగు మ.రా.రా.శ్రీ కవుకొండల వేంకటరావు బి.ఎ.బి.ఎల్.గారు రచించినవివిధకుసుమావళి యను రు0-12-0 లుకిమ్మత్తుగలపుస్తకమొకటియు మాపత్రికాకార్యస్థానము నలంకరించినవి. దయతో బైపొత్తముల నంపినందులకు బ్రహ్మశ్రీ శాస్త్రులవారికిని మ.రా.రా.శ్రీ వేంకటరావుగారికిని యీపత్రికాముఖమున మిగులఁ గృతజ్ఞతఁ జూపుచున్నారము. ఇందలిభావార్థములు చదువరులమనంబుల కానందము గలుగఁజేయును కావున వలయువారలు గ్రంథకర్తలకు వ్రాసినఁ బడయఁగలరు.

ఆంధ్రసేవాపత్రికాధిపతి.

# బొంబాయి.

పాశ్చాత్యులు హిందుదేశమున నడుగిడుటకుఁ బాణిద్వారమై వేనినుండి వచ్చిపోఁగ నిరంతరమేఘజాలంబులఁ గల్పించునోయట్టికర్మాగారముల కునికిపట్టయి హిందుదేశమున కంతకు నుత్తమర్ణులగు పేరు లనఁదగుమార్వాడీలకు జన్మస్థానమై హిందుదేశములోని రేవుపట్టనములలో నగ్రగణ్యమై యలరారుబొంబాయి పదునేడవశతాబ్దారంభమున నిర్మానుష్యమై యనారోగ్యమగునొకచిన్నదీవిగా నుండెను. అప్పుడది పోర్చుగలువారికిఁ జెందుచుండెను. వారి కది యుపయోగము లేకపోవుటచే క్రీ. శ. 1661 వ వత్సరమున వారిరాకుమారికను రెండవ చార్లసనునాంగ్లేయరాజునకు వివాహముచేయుసందర్భమున నీచిన్న దీవిని చార్లసున కరణముగా నిచ్చివేసిరి. కాని యిది ప్రత్యేకము వివాహాహరణముగనే కాక యాంగ్లేయప్రభువు హిందుదేశములోనిపోర్చుగలువారిస్థానముల నన్నిటిని డచ్చివారిబాధ లేకుండఁ గాపాడుటకు నొప్పుకొని యందులకుఁ బ్రతిఫలముగఁ గూడ దీనినిఁ గైకొనెను.

కాని యాద్వీపము నాక్రమించుకొనవలెనని యాతఁడు క్రీ.శ. 1662 వ వత్సరమున నొకచిన్నసైన్యమును మారల్బరో (Marlborough) ప్రభువునాయకత్వమునఁ బంపఁ బోర్చుగలుగవర్నరు వీరికాద్వీపమును స్వాధీనము కానీయక దానపత్రమునందుఁ జిన్నద్వీపమొక్కటియే కాని చుట్టుప్రక్కల నుండుభూమి వివరింపఁబడలే దని యేదో చిన్నమిష పెట్టి వివాదము పెంచి వారిని తీరమున దిగనీయకపోయెను. అంత మారల్బరో తాత్కాలికముగ స్వాలీ (Swally) యనుద్వీపమునఁ దీరము చేరి మొగలాయిచక్రవర్తులయాగ్రహమున

కు గుఱియై తుదకు గోవాకు దక్షిణమున నున్న 'అంజిదీవి' యను నొకనిర్మానుష్యమైనద్వీపమున వారినందఱను దింపి తానుస్వదేశము నకు వెడలెను. పాప మాకొద్దిసైన్యములో నెక్కువభాగ మాదీవి యందు నామావశేషమయ్యెను. ఈచిన్నసైన్యమునకు నాయకుఁడైన సర్ అబ్రహాముషిప్మన్ (Sir Abraham shipman) అనునాతఁడు చార్లసుప్రభువుయొక్కహక్కులనన్నిటిని కంపెనీవారిస్వాధీనము చేయుటకుఁ బ్రయత్నముచేసెను గాని పాప మాతఁడు తనప్రయత్నము కొనసాగకపూర్వమే క్రీ. శ. 1664 వవత్సరమునఁ బరలోకగతుఁడా యెను. అతనికార్యదర్శి యైనకుక్ (Cook) అనునాతఁడు తరువాత నాయకత్వమును వహించి మిగిలినకొలఁదిసైన్యమును రక్షించునుద్దేశ ముతో బొంబాయికి లోఁబడియున్నచిన్నగ్రామములను బోర్చుగలు వారిస్వాధీనము చేసెను. అట్లు చేయుచుఁ దనచిన్నసైన్యము సురక్షి తముగా బొంబాయి చేరి యలజడి లేకుండఁ గాలముగడపుకొననిచ్చు నటులఁ బోర్చుగలువారివలన వాగ్దానమును బొందెను. ఆయొడంబడిక ప్రకార మాయాంగ్లేయులు పరలోకగతులయినవారి యుత్తరక్రియల నెరవేర్చుకొని మిక్కిలిక్షీణతనొంది మెల్లఁగా క్రీ. శ. 1665 వవత్సర ము ఫిబ్రవరినెలలో బొంబాయిఁ జేరిరి. మొదట నాంగ్లేయదేశము నుండి వచ్చిననాలుగువందలసైన్యమునకు నిప్పుడు తొంబదియేడుగురు మాత్రమే మిగిలియుండిరి.

చార్లసురాజు వివాహసంబంధము నిశ్చయముచేసికొనినప్పుడు హిందుదేశపుభూగోళము నెఱుఁగనివాఁ డగుటచేఁ బోర్చుగలువారిదా నపత్రములోని "బొంబాయిద్వీపమును రేవున" ను దానిలో సాల్సె టి (Salsette) కలసియున్నదియు లేనిదియు గ్రహింపలేకపోయెను. వాస్తవముగ నీరెండిఁటిమధ్య 125 గజములవెడల్పుగలయొకయుప్పు

పేరుగలదు. అందుచేఁ గొందఱివలన సాల్సెటి బొంబాయిలోఁ జేరిన ట్లుగను మఱికొందఱివలనఁ జేరనట్లును భావింపఁబడవచ్చును. దీనినా ధారముగఁ దీసికొని చార్లసుయొక్క భూగోళజ్ఞానశూన్యతవలనఁ బో ర్చుగలువారు క్రీ॥ శ॥ 1739 వ వత్సరముదనుక సాల్సెటినిఁ దమస్వా ధీనమందే యుంచుకొనిరి. అటుపైన మహారాష్ట్రు లాద్వీపమును దమ స్వాధీనముఁ జేసికొనిరి. తరువాత మహారాష్ట్రులయొద్దనుండి యాంగ్లే యులు క్రీ॥ శ॥ 1774 వ వత్సరమున దానిని లాగుకొని క్రీ॥ శ॥ 1782 వ వర్షమున జరిగినసాల్బాయి (Salbai) సంధిమూలకముగా దత్తపఱ చుకొనిరి.

పోర్చుగలువా రట్లు సాల్సెటినిఁ దమస్వాధీనమం దుంచుకొని నను చార్లసు బహిరంగముగ వారితో వివాదమును బెంచుకొన న్ని ష్టపడకపోయినను గోవారాజప్రతినిధి కాంగ్లేయగవర్నరు హక్కులు విడిచిపెట్టినయొడంబడికకుఁ దనసమ్మతినీయక యాతనికార్యములకుఁ దా నుత్తరవాదిని గానని తెల్పి యాతనియుద్యోగమున సర్ జర్వేస్ లూకస్ (Sir Jerwase Lucas) అనునూతనోద్యోగి నొకని నియ మించెను. కాని యీనవీనుఁడు మరుచటివత్సరముననే కాలధర్మము నొందుటచే చార్లసునకు హిందుదేశములోనియీచిన్నరాష్ట్రమువలన నాదాయము లేకపోవుటయేకాక కొంత వ్యయమగుటయు, సూరతు లో నుండునాంగ్లేయవర్తకసంఘముతోను, గోవాలోనిపోర్చుగలువా రితోను వివాదములును, మహారాష్ట్రులదాడియు మొదలయినచిక్కు లు తటస్థించుటచేత నీహిందుదేశపుభాగము నెటులయిన వదల్చుకొన వలెనని నిశ్చయముచేసికొని విదేశీయులు కొందఱు దానినిఁ గావల యునని కోరినను నాంగ్లేయతూర్పుహిందూవర్తకసంఘము (The English East India Company) ను ముం దడిగికాని మఱియొక

కీయఁ దలఁచుకొనలేదని యాతఁడు తెలిపెను.

కంపెనీవారు చాలకాలమునుండి యీభాగముపైఁ గనువైచి యుండిరి. ఏలయన నిది హిందూదేశపుఁబశ్చిమతీరమునకు మధ్యభాగము నాక్రమించుటయుఁ బోర్చుగలువారియొక్కయు డచ్చివారియొక్కయు వర్తకస్థానములకు మీఁదుగా నుండుటచే వారివలన నేవిధమైనయపాయము రాకుండఁజేసికొనుటకు వీలగుటయే కాక యవసరమైనప్పుడు వారిని లోఁబఱచుకొనుట కనుకూలముగ నుండుటయు, మొగలురాష్ట్రమునకు వెలుపలనుండుటచే మొగలుచక్రవర్తులయాగ్రహమునకు గుఱిగాకుండ దిట్టమైనకోట గట్టుకొనుటకు వీలుగ నుండుటయు, వారిదృష్టి నీరేవువైపునకు మఱల్చెను. ఇట్లు దానిని సంపాదింపవలయునని కోరియుండుటవలననే వారు క్రీ. శ. 1626 వవత్సరమున డచ్చివారితోఁ గలిసి బొంబాయినిఁ బట్టుకొనిరిగాని నిలుపుకొనలేకపోయిరి. తరువాత సూరతువర్తకసంఘము దీనిని సంపాదించుట కనేకప్రయత్నములు చేసి క్రీ. శ. 1652-53 లో బొంబాయియు బేసీను (Bassein) ను బోర్చుగలువారియొద్దనుండి కొనవలెనని డైరక్టరులకు సలహానిచ్చెను.

కాని యిప్పుడో తన కాద్వీపమక్కరలేదుగనుక నెటులయిన వదల్చుకొనవలెనని యెంచి యందులకు చార్లసు దానిని గురించి మిక్కిలి పొగడుట ప్రారంభించినకొలఁదియుఁ గంపెనీవారిదివరలో దానియాధిక్యము నుగ్గడించువారయ్యు నిప్పుడు మాత్ర మది నిష్ప్రయోజనకారియని పలుకఁజొచ్చిరి. అందుచే చార్లసు వారియుద్దేశము నడిగినప్పు డతిజాగరూకతతో వా రిట్లు తెలియఁజేసిరి. “ఇదివరలో నున్నయప్పులతో నిమిత్తములేకుండ మా కిచ్చినయెడల నింతకాలమునుండియు నున్నయీబరువును మీకు తగ్గించి మేమే వహింౘె

దము. ఇటు లోనర్పుటవలన మాసంఘమునకు వచ్చునష్టమును మేము బాగుగా నెఱుగుదుము. మీరు పుచ్చుకొనకపూర్వము పోర్చుగలువారే మాకు దీని నీయఁదలఁచుకొనినయెడల నటు లెన్నఁడు నంగీకరింపకపోయియుందుము."

అప్పటి కప్పుడే చార్లసున కీస్థలమునందుఁ బూర్తియైనవిరక్తి జనించుటచేత నెట్టిపద్ధతినైనను దానిని వదల్చుకొనవలెనను నిశ్చయము కలిగి క్రీ. శ. 1668 వ వత్సరము మార్చినెలలో దానిని వర్తకపు సరకులు యుద్ధసామగ్రులతోఁ గూడ సంవత్సరమునకు పదిపౌనులనఁగా నాకాలమున నూరురూపాయలు క్విటు రెంటు కట్టి శాశ్వతపుహక్కుతోఁ గంపెనీవారి కిచ్చివేసెను.

రాజప్రతినిధులు రాజమర్యాదలతో దానిని క్రీ. శ. 1668 వ వత్సరము సెప్టెంబరు 23 వ తేదీని కంపెనీవారికి స్వాధీనముచేసిరి. ఈ మార్పువలన సూరతుసంఘములోనియధిపతియే బొంబాయికిఁగూడ గవర్నరును, ముఖ్యనాయకుఁడు నయ్యెను. కాని యాతఁడు సూరతులోనే నివసించుచు బొంబాయిలో నొకసహాయోద్యోగి నేర్పఱచుకొనెను.

సముద్రముమీఁద నుండిగాని భూమిపై నుండిగాని శత్రువు లెవరును వచ్చుటకు వీలులేకుండ నాపట్టనమునకు రక్షణము నేర్పఱచుకొనవలెనని యాంగ్లేయదేశములోని డైరక్టరు లాలోచించి పూర్వము లండనుమహాగ్నిప్రమాదమువలన దగ్ధమైనతరువాతఁ గట్టిన యాపట్టనముయొక్క పటమును బొంబాయిని గట్టునపు డుపయోగించుటకు హిందుదేశములోనితమయుద్యోగులకుఁ బంపిరి. అదివరలో నాంగ్లేయరాజపక్షమున నున్నహిందుదేశములోని సైన్యము కంపెనీవారిసైన్యముగా మారెను. అచటనే యాంగ్లేయులు శాశ్వతముగ

నివసించుటకు వీలుకలుగఁజేయుటకై మంచినడత గలిగినయిరువది గురవివాహితలగుస్త్రీలను దీసికొనిరావలయుననియు, వారి నట్లువచ్చినటులఁ జేయుటకై మొదటిసంవత్సరమున వారి కాహారసామగ్రులను, నొకజత దుస్తులను నుచితముగ నీయవలయుననియు నందులకు వారు సంస్కారవత్సులనే వివాహమాడవలయుననియు నేర్పఱచిరి.

క్రీ. శ. 1671 వ వత్సరమునాఁటికి సూరతుసంఘాధ్యక్షుఁడు బొంబాయి నొకప్రత్యేకరాష్ట్రముగ నెన్నుచుండెను. ఆంగ్లేయు లచట నివాసమేర్పఱచుకొని పందులను బాతులను బెంచుకొనునట్లు వారికి వసతు లేర్పఱుపఁబడెను. మొదటియొకటిరెండువత్సరములవఱకు స్వదేశీయపనివాండ్రందఱకును జీతముల నేర్పాటుచేసి తీసికొనివచ్చిరి. విదేశీయపనివాండ్రుగూడ సంస్కారులైనయెడలఁ గుటుంబములతో వచ్చి కాపురముండునటుల సౌకర్యము లేర్పఱుపఁబడెను.

సూరతులోనిసంఘము నధ్యక్షుఁడును. దమపూర్వు లిచ్చినవానిని మార్పుచేయుస్వభావముగలవారును, నాంగ్లేయదేశములోని డైరక్టరులు మాటతప్పనివారును సమర్థులు నని స్వదేశీయులకు నమ్మకముండుటచే నాంగ్లేయదేశములోనివర్తకసంఘమునుండి తాము నమ్మఁదగినయధికారపత్రముఁ జూపినఁగాని సూరతులోనిస్వదేశీయవర్తకులు బొంబాయి వచ్చి కాపురముండుట కియ్యకొనరైరి. అదిగాక మహారాష్ట్రులకును మొగలులకును వివాదములు జరుగుచుండునా ప్రదేశమున రక్షణములేనిచోట నుండుటకు వారు సమ్మతింపలేదు. అంతియే కాదు. ఆయనారోగ్యకరమైనస్థలమునందు జనులకు నాయుఃప్రమాణము చాలఁ దక్కువగ నుండెను. అచ్చటకు వచ్చినయైరోపీయులకు సగటున మూఁడువత్సరము లాయుఃప్రమాణమనియు,

వచ్చినవారైదుగురిలో నలుగురు ప్రాణములు విడుచుచున్నారనియు దీనికిఁ దోడు కలరామహావ్యాధి యచట వ్యాపించియుండుటయు నాంగ్లేయు లెవ్వరు నచట నుద్యోగములు చేయుట కిచ్ఛగింపకుండునట్లు చేసెను. బొంబాయియొక్కయనారోగ్యస్థితిఁ జూచియే యేజంకును గొంకును లేనిమొండిధైర్యము గలిగినసర్ జాన్ చైల్డు (Sir John Child) నునాతఁడు సంఘములోని రెండవసభ్యపదమును నిరాకరించెను.

స్థలమున కున్నయీచిక్కులకుఁ దోడంతఃకలహములుగూడఁ బ్రారంభమయ్యెను. ఆంగ్లేయరాజోద్యోగులకును, కంపెనీవారిసేవకులకు నుండునిరంతరపోరాటములు చాలవా యనునట్లు కొలఁదికాలములో విదేశీయశత్రువులతోఁ బోరాటముగూడ సిద్ధమయ్యెను. అందుచే బొంబాయిరక్షణమునిమిత్త మూరువేలసైన్యము క్రొత్తగ నియమింపఁబడెను.

కంపెనీవారిడైరక్టరులు బంగాళాఖాతమునుండి యట్లాంటిక్ మహాసముద్రమువఱకు నుండుతమప్రదేశములన్నిఁటిలోనిసేవకులను లోఁబఱచుకొనుటకుఁ దగినశక్తి లేకపోవుటచేతను, నాంగ్లేయదేశములోఁ గూడ రాజ్యపరివర్తనము గలిగి ప్రజాస్వామ్యము చార్లసురాజుయొక్కప్రభుత్వముగా మారుటచేతను వారివర్తకస్థానములన్నిఁటిలోఁ నుండుసేవకులు కొందఱు రాజాభిమానులును తక్కినవారు ప్రజాస్వామ్యాభిమానులు నగుటచే వారిలో నొకరిపై నొకరు తిరుగుబాటు చేయమొదలిడిరి. అన్నివర్తకస్థానములతోఁబాటు బొంబాయివర్తకస్థానములోఁగూడఁ దిరుగుబాటు జరిగెను. హిందుదేశములోనివర్తకస్థానము లన్నిఁటిలో నచ్చటితిరుగుబాటే మొదటిది.

ఆంగ్లేయరాజసైన్యము కంపెనీవారియధికారులను క్రీ.శ. 1666

వ వత్సరమున నెదిరించెను. దానికిఁ గారణము రాజ్యసైన్యనాయకుఁ డైనకుక్ (Cook) అనునాతఁడు.

తరువాత క్రీ.శ. 1674 వ వత్సరమున నింతకంటె నెక్కుడు ప్రబలమైనతిరుగుబాటు జరిగెను. ఇందు సైనికులందఱును దమ కొకనెల వేతనము ముందీయవలెననియుఁ దమయొడంబడికప్రకారము మూఁడు సంవత్సరములు తాము సేవచేసిరి గనుక దమ్ము వదలివేయవలయుననియు వారు కోరిరి. ఈతిరుగుబాటు చేసినవారిలో మొనగాని నురిదీసి మఱియిద్దఱను గూడఁ జంపి సేనానాయకుఁ డాంగ్లేయద్వీపము పోవునట్లుగ శిక్షవిధించుటచే శాంతము గలిగెను.

తొమ్మిదివత్సరములు గడచినతర్వాత ననఁగా క్రీ.శ. 1683వ వత్సరమున కీగ్విన్. (Keigwin) అనుధైర్యశాలియైనసైనికుఁ డొకఁడు గవర్నరును బందీకృతునిఁజేసి కంపెనీవారియాజ్ఞలకు వ్యతిరిక్తముగ నొకవత్సరము తానే గవర్నరుగ నుండెను.

ఈయంశము చెన్నపట్టనమునందు వింటరుప్రభువు పైయధికారులయనుమతికి వ్యతిరేకముగ రాజ్యభక్తియుతుఁడై జార్జిఫాక్సుక్రాఫ్టను గవర్నరును మూఁడువత్సరములు కారాగృహమం దుంచుటకు సామ్యమును వహించుచున్నది.

కీగ్వి నంతటితో నూరకొనలేదు. బొంబాయిరేవులోనికంపెనీయోడ నొకదాని నెక్కి యందుఁ దనసైన్యముయొక్కవ్యయమునిమిత్త మైదువేలరూప్యములను దీసికొనెను. అంతియే కాదు. అచటనుండు జనులవలన గవర్నరుగ నెన్నుకొనఁబడియాంగ్లేయరాజైన 2వ చార్లసుపక్షమున నొకయాజ్ఞాపత్రమును బ్రచురించెను. అందు దాతఁడు తెలిపినముఖ్యాంశము లిటు లుండెను. "కంపెనీవారు భరింపశక్యముగానిబాధలను బెట్టి ధనమును గ్రహించుటయు, జనులను మిక్కి

లి హింసించుటయు, నన్యాయముగఁ బన్నులు విధించుటయు, నాంగ్లే యరాజ్యమునకుఁ దగ్గనగౌరవమును నిలుపుకొనలేకపోవుటయే కాక తమయిష్టమువచ్చినట్లుగ నారాజశాసనములను మార్పుచేయుటయుఁ జూడలేక తా నట్లుప్రచురింపవలసివచ్చె" నని యాతఁడు తెల్పెను. తాను జేసినప్రకటనమునకుఁ గలిగినయగత్యమును దెలుపుకొనుచు విపులముగ చార్లసునకు నాతనిసోదరుఁడైన జేమ్సు (James) నకు నాతఁ డుత్తరములు వ్రాసికొనెను. దేశభక్తిని బురికొల్పునొకచిహ్న మును బెట్టి క్రొత్తయాంగ్లేయపతాకము నొకదానిని నిర్మించెను.

పాపము రాజగౌరవమును నిలుపుట కిన్నివిధములయినకార్య ముల నాతఁ డొనర్చుటయే కాని రాజగౌరవము నధికారము ననుపద ముల కాతనికి సరియైనయర్థము తెలియనే తెలియదు. ఇందుల కొక తార్కాణము. రాజద్రోహములుగఁ గంపెనీసేవకు లొనర్చుదౌర్జ న్యములలో నాదివారమునాఁడు క్రైస్తవమతానుసారముగ నొనర్ప వలసినవిధులను వారు నిర్వర్తింపకపోవుటయు మంత్రప్రయోగముచే యుటయుఁ గూడ రాజద్రోహములుగనే యాతఁడు తెలిపెను.

ఇట్లు తనప్రతిపక్షులస్వల్పనేరములనైనను గొండంతలుచేసి విన్నవించుటయే కాని తనయధికారమునకుమాత్రము రాజానుమతి గలదని తెలిపికొనుచు న్యాయ్యముగఁ బ్రవర్తించుచుండెను. మహారా ష్ట్రులు కంపెనీవారిదేశములకుఁ గలిగించిననష్టములకుఁ బ్రతిఫలముగ వారియొద్దనుండి నాలుగువేలపౌనులుధనమును గ్రహించుటయే కాక హిందుదేశపు నైరృతితీరమున వర్తకస్థానములఁ గట్టుకొనుట కనుమ తియుఁ దూర్పుతీరమున నున్నవానికిఁ బన్నులులేకుండుట కనుమతి యుఁ బొందెను. బొంబాయిలోఁ బన్నులు విధించుట కాతఁడు చేసిన యేర్పాట్ల నాతని నుద్యోగమునుండి తొలఁగించినతరువాతఁ గంపెనీ

వా రవలంబించిరి. అనధికారులను వర్తకము చేసికొననిచ్చుటచే నా తఁడాప్రాంతములలోనివర్తకమును వృద్ధిచేసెను. తనయధీనమున నూటయేబదియాంగ్లేయసైనికులును రెండువందలు దేశీయసైన్యము నుండుటచే వారిసాహాయ్యమునఁ గంపెనీవారియధికారమును బూర్తిగఁ దొలఁగించవలెనని కూడ నాతఁడనుకొనుచుండెను. తనయుద్దేశ ప్రాప్తి కాతఁడు క్రీ.శ. 1684 వవత్సరము జూనుమొదటిదినమున సూరతువర్తకస్థానమున కధ్యక్షుఁడైనచైల్డ (Child) నునాతని బంధింపవలెనని యచటిసంఘములోనిసభ్యులకుఁ దెలిపెను. ఈచైల్డను నాతనిగురించి ముందు విపులముగఁ దెలుపఁబడును.

# శాస్త్రాంశములు.

## అణుస్వరూపము.

ప్రపంచమునుగూర్చి మన మిదివరలోఁ జేసినదంతయు బాహ్యపరీక్షయే. దానివలనఁ బర్యవసానము మనకంటి కగపడురీతి నీ భూమి చలనములేని పెద్దగోళమును, మిగిలినచంద్రసూర్యనక్షత్రాదులు దీనిననుసరించి తిరుగుచిన్నగోళములును గాక తోడిగోళములతోఁ బాటు నిదియుఁగూడఁ దిరుగుచున్నదనియు దీనికంటె మహత్తరములగు లోకము లింకను జాలఁ గలవనియు నట్టియసంఖ్యాకలోకసమూహమే ప్రపంచమనియుఁ దేలినది గదా! ఇట్టిజ్ఞాన మలవడుటకు మానవజాతి కనేకశతాబ్దములు పట్టినది. అంతదనుకఁ గేవలచక్షురింద్రియానుభవమునే పరమార్థముగా గ్రహించుచునీభూమివినా లోకములే లేవని జనులు తలఁచుచుండుటయే కాక యెవరయినను నూటికొకరు గాని కోటికొకరు గాని యీయభిప్రాయమునకు భిన్నముగాఁ జెప్పినచో వారిని దుర్మార్గులుగను మహాపాపులుగను భావించునంతటిస్థితిలోఁగూడ నుండెడివారు. ఇంతియ కాదు. ఒకమహాపురుషుఁడు, స్వార్థత్యాగి, కేవలలోకోపకారపారీణుఁడు, యథార్థవాది బ్రూనో (Bruno) యనునాతఁడు తనయపారమేధాకౌశలమునఁ బైయంశమును గనిపెట్టి తన దేశీయులకు వెల్లడిచేయ వా రొనర్చినప్రత్యుపకార మేమి? శాలువలు పతకములు మున్నగునవి సమర్పించి యర్చించుటయా? కాదు. సజీవుఁడగునమ్మహాభాగు నగ్నిజ్వాలల దగ్ధునిఁజేయుట! అహా! మూర్ఖు లెంతెంతదారుణకృత్యముల కొడిగట్టరు! అట్లతని నతిఘోరహిం

సపాలు గావించినకవీశ్వరాత్ములలో నొక రిట్లు వ్రాసిరి. "కావున నతఁ డట్లగ్నిజ్వాలలలోఁ దోయఁబడి నికృష్టపుచావు చచ్చెను. కల వని తాను భ్రమఁ జెందునితరలోకములలో రోమనులు తనవంటికల్లరి మూక నెట్లాదరింతురో యతఁడు వర్ణించి చెప్పవచ్చును." ఆకాల ప్రజనులయజ్ఞానమునకును పరమతాసహిష్ణుతకును పై వాక్యరత్నము కన్నఁ దార్కాణము వేరొం డేమి గావలయు?

ఇఁక ప్రకృతము. ప్రపంచ మనేకలోకసముదాయ మని దూరదర్శినీయంత్రసాహాయ్యమునఁ గనిపెట్టఁబడి మనస్సుయొక్క కల్పనాప్రభావమున నిర్ధారణ సేయఁబడినది. ఇఁక సూక్ష్మదర్శినీయంత్రము చేకొని ప్రపంచతత్వమును గనుగొనినమహాపురుషులయనుభవ మెట్టిదియో విచారింతము. భూమియందలి యేపదార్థమును మనము పరిశీలించినను దానికి విభాజ్యత (Divisibility) యనుగుణ మొకటి యుండితీరవలయునని ప్రకృతిశాస్త్రసమ్మతము. ఒక యినుపముక్క యున్నదనుకొనుఁడు. దానిని తగినసాధనముల నుపయోగించినచోఁ జిన్నిచిన్నిముక్కలుగను, తిరిగి వానిని రజముగను, నీరీతినిఁ గట్టకడపటఁ గేవలమనోగోచరము లగుననేకరేణుసమూహముగను విడదీయవచ్చును. ఇట్లే యొకపాత్రలోనిజలమునుగాని మరియేయితరద్రవపదార్థమునుగాని చిన్నిచిన్నిభాగములుగాను, వాని ననేకరకములగుబిందువులుగను, తుంపరలుగను, తుదకు లెక్కలేనిరేణువులుగను జేయవచ్చును. కాని యట్లు విభజింపఁబడినను వస్తువుయొక్కప్రాకృతికగుణములు మాత్రము మారనేరవు. ఇనుమునం దున్న ప్రాకృతికగుణములన్నియు నినుపరేణువులయం దుండును. నీటియందలి నైసర్గికగుణము లెల్ల నీటిరేణువులయం దుండును. ఇట్లు విభజించుచో రానురాను తుద కొక యవధి యుండవలయుఁ గదా! అట్టియవధినే యణువ (Molecule)

ని వారు పేర్కొనిరి. ప్రకృతియందలిప్రతిపదార్థము నణురూపము నొందువఱకు విభజింపవచ్చుననియు, నతఃపర మట్టివిభజనముశక్యము కాదనియు వారియాశయము. ఇది ప్రకృతిశాస్త్రజ్ఞులు చేరినపరమావధి. ఇఁక రాసాయనికు లన్ననో వీరి నతిక్రమించి కొంతదూరము ముందున కరిగిరి. వా రిట్టిజలరూప మగునణువు నింకను విభజింపవచ్చుననియు జలము సమస్తపదార్థము (compound) గానఁ దత్సంబంధమగునణువునుండి వ్యస్తపదార్థములు (Elements) లభ్యములు కావలెననియు వాదించుచు వారివిచిత్రపద్ధతులసహాయమున నీద్రవరూపమగునణువునుండి రెండురకములగువాయురూపపరమాణువు(Atom)ల సంపాదించిరి. ఇట్లే యొకయినుపరేణువునుండిగూడ రెండుపరమాణువుల సంపాదింపవచ్చును. కాని యీ రెండింటికిని జాలభేదము గలదు. జలము సమస్తపదార్థమగుటవలన దానినుండి బయలుదేరినపరమాణువులధర్మములును దానియణుధర్మమును కేవలము వేరుగా నుండును. ఇనుము వ్యస్తపదార్థముగాన దానిసంబంధములగుపరమాణువులును దానియణువు నొకేస్వభావము గలవై యుండును. ఇట్లుపలువిధములగుపదార్థములఁ దమరాసాయనికశాస్త్రపద్ధతులఁ బరీక్షించి తచ్ఛాస్త్రజ్ఞులు భూమండలమందలిపదార్థములలో నెల్ల సుమా రెనుబదివ్యస్తపదార్థములుమాత్రము గలవనియు నవియే తమలోఁదా మనేకలక్షలభంగులఁ గలసి మనకు గోచరించునిఖిలవస్తుజాతముగను మారుననియు నిశ్చయించిరి. కనుక వీరిమతానుసార మీదృశ్యప్రపంచమందలివస్తుజాలసృష్టికంతకు నీయెనుబదివ్యస్తపదార్థపరమాణువులే పునాదులు. ఇవి సృష్ట్యాదినుండియు నొకేవిధములుగా నవిభక్తములై యవిచ్ఛిన్నములై తనరారుచుండును.

గతశతాబ్దాంతమువఱకుఁ జైవమతమునే జనసామాన్య మేమి

శాస్త్రవేత్త లేమి పరమార్థముగా నమ్మియుండిరి. కాల మెంతలో నెట్టివిపరీతములఁ బుట్టింపఁ జాలదు? బహుప్రయపరియాసార్జితంబై (Kelwin) కెల్విన్ మున్నగు మహానుభావులవల్లఁ గూడ యథార్థమని భావింపఁబడుచువచ్చినపై మతము నేఁటికి హాస్యాస్పదము కావలసివచ్చినది. దీనికెల్లఁ గారణ మీశతాబ్దారంభమునఁ బ్రకృతిశాస్త్రకోవిదు లగుక్యూరీ (Curie) యనునాయనయు నతనిసతీమణియుఁ గనుగొన్న రేడియము (Radium) ను నూతనపదార్థవిశేషము. దీనిమహిమఁ జూడఁ గడునపూర్వముగను, నత్యద్భుతావహముగను నున్నది: ఏదైన నొకదీపమును జూతుఁడు. దానినుండి వేఁడిమియుఁ గాంతియు నను రెండుశక్తు లెల్లపుడు వెలువడుచుండును. ఆదీపపుబుడ్డిలోనిచమురు క్రమముగా క్షీణించుకొలఁది నీరెండుశక్తులునుగూడ క్షీణించుచుఁ దుద కాచమురు కాలిపోవుసరి కవిరెండును గూడ మాయమగును. మరియు నూనె సమృద్ధిగ నుండఁగనే యాదీపము నొకపాత్రమునసుంచి వాయుపరిసారములేకుండఁ బైన మూఁతవేసి యుంచి చూడుఁడు. వెంటనే దానియుష్ణకాంతిశక్తులు క్రమముగాఁ దగ్గుట కారంభించి మూఁడునాలుగునిముషములలో నది యగోచరమగును. కాని యాదీపమారిపోఁబోవునపుడు వాయుపరిసారము గలుగునట్లు పైమూఁత తీసివేసినయెడల మరల నది పెద్దదయి యెప్పటియట్లఁ గాంతియుష్ణముల నిచ్చుచుండును. ఇదివరలో వాయుతత్వమునుగురించి వ్రాయుచో నీ వాయువులో రెండువిధములగు వాయుభేదములు గలవనియు వానిలో దీపములను మంటలను బోషించునది ప్రాణవాయువనునది యొకటి యనియుఁ జెప్పియుంటిమి, కావున దీపమునుండి వెడలుకాంతియుష్ణశక్తులకును దైలప్రాణవాయువులకును నేదో యొకయవినాభావసంబంధ ముండియుండవలెను. ఈయంశమును రసాయనశాస్త్రవేత్తలు బాగు

గఁ బరిశీలించి కనిపెట్టినదేమన :—సమస్తపదార్థము లగునూనె యుణువులనుండి రెండువిధములగు పరమాణువులు బయలువెడలి ప్రాణవాయువుయొక్క పరమాణువులతోఁ గూడి జలము బొగ్గుపులుసుగాలి యను రెండునూతనములగు సమస్తపదార్థముల యణువు లగును. ఇచట సమస్తవస్తువగు తైలము రెండువ్యస్తవస్తువులుగ మారుటయుఁ దిరుగ నీ రెండువ్యస్తపదార్థములును ప్రాణవాయువుసంపర్కమున రెండుక్రొత్తసమస్తపదార్థములుగ మారుటయును రాసాయనికమార్పులు. ఇట్టి రాసాయనికములగుమార్పులు జరుగుటకుఁ గొంత రాసాయనికశక్తి యావశ్యకము. మొదటివిషయమున ననఁగాఁ దైలాణువులు వ్యస్తాణువులుగా మారునపు డీశక్తి కొంత బయలుదేరి దానిలోఁ గొంత భాగము జలము మొదలుగాఁగల నూతనపదార్థనిర్మాణమున కుపయోగింపఁబడును. మిగిలిన రాసాయనికశక్తి మన కగపడు కాంతియుష్ణశక్తులుగ మారును. ఇట్టే క్రొవ్వువత్తిదీపములేమి దీపావళినాఁడు గాననగు చిత్రవిచిత్రములగుజ్యోతిర్విశేషములేమి యుత్సవాదులలో నుపయోగింపఁబడుగ్యాసులైటులేమి యివియన్నియు నుష్ణమును వెలుతురు నిచ్చుటకుఁ గారణము కొంత రాసాయనికశక్తి యీశక్తులుగ మారుటయే. ఇఁక విద్యుద్దీపము లన్ననో వానిలో విద్యుచ్ఛక్తి యీవిధముగ మారును. కావున నుష్ణవంతములు కాంతివంతములు నగు నేపదార్థమును మనము పరికించినను నేదో యొకవిధమగు నితరశక్తివిశేష మీశక్తులుగ మారుట మనము గనుగొందుము. కాఁబట్టి యే వస్తువయినను గాంత్యుష్ణముల నెల్లపుడు నవిచ్ఛిన్నములుగ నిచ్చుచుండవలెనన్న దాని కనవరతము మఱియొకశక్తి యేదోయొకరీతిని వచ్చుచునే యుండవలెను. రేడియముప్రభావ మెట్టిదో కాని యితర శక్తిసహాయ మేమియు నక్కరలేకయే తనంతటఁ దానే యెంతకాల

మైననవిచ్ఛిన్నముగా నుష్ణమును గాంతిని నిచ్చుచునే యుండును. ఇంకను బలువిధములగు శక్తుల నత్యద్భుతముగా నింతకాలమువఱకు నను నియమములేక కడుధారాళముగా నెల్లపుడు పరసాహాయ్యమపేక్షింపక యీవిచిత్రపదార్థము స్వయముగనే పుట్టించును. ప్రకృతిశాస్త్రవేత్తలలో మిగులగణుతికెక్కినలార్డురేలే (Lord Raleigh) గారికుమారు లగుగౌరవనీయులగు ఆర్. జె. స్ట్రట్టు (Hon. R. J. Strutt)అనునాయన యీపదార్థము నొకగడియారనిర్మాణమునం దుపయోగించి తచ్ఛక్తిమూలమున దానిని నడిపింపఁగలిగిరి. అట్లొనర్చి యీగడియారములోనియితరభాగములు సరిగాఁ బనిచేసినచో వేలకొలఁదివత్సరము లట్లు శిథిలముగాక పనిచేయుచునే యుండునని వారియాశయముగా సెలవిచ్చిరి. ఇట్టియద్భుతశక్తు లింక నెన్నియో దీనియందుఁ గలవు. వానినన్నిటిని వివరింప నిది యదనుగాదు. ప్రకరణానుసారముగా ముందుముందు వివరించెదము.

ప్రకృతమున మనము గమనింపవలసినవిషయము దీనియం దిట్టిశక్తి స్వయముగాఁ బుట్టుట. "ప్రపంచమున నెక్కడఁ జూచిన నొకవిధమగుశక్తి మఱియొకటిగా మారునుగాని శక్తి స్వయముగా జన్మించుట గాని యస్తమించుట గాని యీపన్మాత్రమైనను జరుగనేరదు" అని ప్రకృతిశాస్త్రమూలసిద్ధాంతము. ఇది దానికి విలక్షణముగా నున్నట్లు కనుపడుచున్నది. మఱియొకవిశేషము. పై నుదాహరణములుగా గ్రహింపఁబడినయుష్ణవంతములు కాంతిమంతములునగుపదార్థములలోనెల్ల నాశక్తులకుఁ గారణ మొకపరమాణువుమరియొకపరమాణువుతోఁగలియుటయే. కాని యీరేడియమునుండి శక్తి యుద్భవించునప్పు డిట్టిపరమాణుసమ్మేళనము లేకయే పరమాణువు స్వతస్సిద్ధముగనే యట్టిశక్తిని బుట్టించుచున్నది. ఇట్టిస్వభావమీయొక్కవస్తువునకేగల

చా ? మిగిలినవానికిఁ గూడ నున్నదా యని శాస్త్రజ్ఞులు పరీక్షించి యిది దీనిగుణవిశేషము గాదనియు నన్నిపదార్థములపరమాణువులును కొద్దిగనో గొప్పగనో యిట్టిశక్తిని గల్గియే యున్నవనియు నీపదార్థము నందట్టిశక్తి బహుళముగా నున్నందున వెంటనే దృగ్గోచరమయినదనియు సిద్ధాంతీకరించిరి.

ఈవిషయమునుగురించి పండితులు బహుదీర్ఘముగా విచారించిచూడఁగా నిదివరలో ననుకోన్నమాడ్కి నీపరమాణువులుదుర్భేద్యములగుపాషాణములవంటివి గావనియు వీనికిఁ గూడ నొకయంతర్నిర్మాణము (Interval structure) గలదనియుఁ దేలినది. పరమాణువు నొకదానిని భేదించినయెడల దానిలో నన్నివైపులకు నతిమిక్కుటమైనవేగముతోఁ బరుగులిడుచుండు నతిసూక్ష్మతరములగు రేణువులు లెక్కకుమీఱియుండును. అట్టిసూక్ష్మతమరేణుపరిమాణమునకును పరమాణుపరిమాణమునకును గలభేద మెంతయన నీకాగితముమీఁది యొకచిన్నిసిరాచుక్కకును నొకమహాసౌధమునకును బరిమాణతారతమ్య మెంతయుండునో యంత యుండునని తత్త్వవేత్తలు నిర్ణయించిరి. ఇట్టి యీరేణుసముదాయమెల్ల నొక్కపరమాణువుగర్భములో నిమిడి యుండి మహావేగముతో సూర్యకుటుంబములో గ్రహసంచయమెల్ల సూర్యునిచుట్టుఁ దిరుగుమాడ్కి తిరుగుచుండును. ఒకదానిని సూర్యకుటుంబమని నట్లే రెండవదానిని మనము పరమాణుకుటుంబమని పేర్కొనవచ్చును.

పాఠకమహాశయులారా ! చూచితిరా! ఒకపరమాణువునకును నీటిబొట్టునకును బరిమితిలో భూమండలమునకు నొకచిన్ని నీసపుగుండునకుఁ గలపరిమాణతారతమ్యమంతవ్యత్యాసము కలదని గతశతాబ్దమందలిప్రకృతిశాస్త్రజ్ఞులలో నెల్ల శిరోభూషణంబయి తనయసాధా

రణమేధాశక్తిఁ దచ్ఛాస్త్రమున క్రొకనూతనవన్నె కల్పించి (Lord kelwin) లార్డు కెల్విననుబిరుదనామమును వహించిన మహాపురుషుఁడు వ్రాసియున్నాఁడు. అట్టిపరమాణువునకును బైనఁజెప్పఁబడినయత్యల్ప రేణువులకును హస్తిమశకాంతరంబు గలదఁట. అహో! ఏమి యీపరమేశ్వరునిర్మాణకౌశలము! స్థూలాతిస్థూలప్రపంచమున నెల్లో సూక్ష్మాతిసూక్ష్మప్రపంచమునఁగూడ నట్లే యతనిలీలావిశేషమవాఙ్మనసగోచరము గదా!

ఓంతత్సత్.

# మానవధర్మములు:

మానవధర్మము లసంఖ్యాకములు. మనుజుఁడు పుడమిపై జన్మించినదిమొదలు శరీరత్యాగ మగువఱకు నజ్ఞానసుషుప్త్యవస్థల విడిచి మిగిలినసర్వకాలసర్వావస్థలయందు నేదియో యొకధర్మమునకు బద్ధుఁడై యుండవలెను.

ధర్మమన నేమో? ధర్మమువలనిప్రయోజన మేమో? మొదటఁ దెలిసికొనవలసి యున్నది. మానవులయుత్కృష్టతకుఁ గారణభూతమై, స్వార్థపరిత్యాగమునం దాతనిమనస్సును లగ్నము చేసి యితర మనుజునియొక్కగాని, సంఘముయొక్కగాని రాగద్వేషములయెడల నాతఁడు నిర్లక్ష్యభావము వహించునట్లు చేయునదియే ధర్మము. ఇట్టి ధర్మములను బాటించినయెడల మానవుల కీదిగువప్రయోజనములు సిద్ధించును.

ఎల్లమానవులు ననంతకల్యాణగుణసంపన్నుం డగునాసర్వేశ్వరునిపుత్రు లనియు నందువలనఁ వారందరు నీపృథ్వియందు నొకచట్టమునకే లోఁబడి యుండవలయు ననియుఁ దమలో నొక్కొక్కఁడును స్వప్రయోజనమునకే కాక లోకోపకారార్థము జీవించుచున్నాఁ డనియుఁ దనజీవితముయొక్క ఫలితము తాను సౌఖ్యముగ దినములు గడపుటయే కాక తన్నుఁ దనసోదరులను మంచిదశలోనికిఁ దెచ్చుటయే యనియుఁ దనసోదరులయుపకారార్థ మన్యాయము పాపము నెచటఁ గాన్పించినను రూపుమాపుటకుఁ బ్రయత్నించుట న్యాయ్యమే కాక తనస్వత్వమనియు నాతఁడు గ్రహియింపఁగలుగును.

కావున నట్టియుత్కృష్టపదమాశయములు సిద్ధించుటకొఱకు మానవునిధర్మము లెటులుండవలయునో యాతఁ డెవరియెడల నెట్లు ప్రవర్తింపవలయునో యాతనికిఁ దెలియవలసియున్నది. తల్లిదండ్రులకును, సోదరులకునుసోదరీమణులకును, అత్తమామలకును, అర్ధాంగికిని, సంతానమునకును స్నేహితులకును సోదరమానవులకును, స్వదేశమునకును సకలజీవకోటికిని వరుసఁగా నాతఁడు మేలొనఁగూర్చుచుండవలయును.

పైఁజెప్పఁబడినయందరికంటె నెక్కుడుగ నాతఁడు ముందుఁ దనజన్మకుఁ గారణభూతుఁడైనయాసర్వాంతర్యామిని, ఆసర్వేశ్వరుని, సర్వశక్తిపరిపూర్ణుని సదా ధ్యానించుచుండవలయును. అంతియేకాదు. ఆతనియాజ్ఞలయందప్రమత్తుఁడై మెలఁగుచుండవలయును.

పైనుదాహరింపఁబడినధర్మములను సరిగ నిర్వర్తించుటకుఁదగిన స్వత్వమును సంపాదించుకొనుటకుఁ దనశరీరమును మనస్సును మంచిస్థితియం దుంచుకొనవలయునుగదా. కావున మానవుఁడు స్వోత్కృష్టతకు నొనర్పవలసినకృత్యములనుగూడఁ దెలిసికొనవలయును. ఇట్టి విషయముల నన్నిఁటినిఁ దెలిసికొని సరిగఁ దనధర్మములనునిర్వర్తించిననాఁడే మానవుఁడు తనజన్మమును సార్థకపఱచుకొనును. అటులొనర్పనినాఁ డాతఁడు మానవనామమును వహించుట కర్హుఁడు గాఁడు.

మానవుఁ డార్థికవిషయమునను, నాధ్యాత్మికవిషయమునను, నభివృద్ధిఁజెందవలయును. కేవ లాధ్యాత్మికవిషయములయందు మనస్సును లగ్నముచేసి యార్థికవిషయమున నిర్లక్ష్యభావమును వహించినయెడలఁ దమయాదర్శప్రాప్తికి వలయుశాంతి, సంతుష్టి, మున్నగుచిత్తశాంతిప్రదము లగుస్థితులు మానవునికి లభించునా? లభింపవు. ఏలయనఁ దనకును దనకుటుంబమునకును దగి

నయన్నపానాదులను సంపాదించినతరువాతనే యాతఁ డితరచింతల మాని భగవంతునిధ్యానింపఁగలుగును. అట్లు సంపాదింపనినాఁ డాతఁ డెంతప్రయత్నించినను మనోనైర్మల్యము సిద్ధింపదు. కావున మానవునికాధ్యాత్మికచింత లెంతయావశ్యకములో యంతకంటె నెక్కువగాకపోయినను తత్తుల్యముగనైన నార్థికచింత లావశ్యకములు. ఈ సందర్భమున మనవారు కొందరొకసందేహమును బొందవచ్చును. 'పూర్వము వ్యాసాదిమహామునీశ్వరుల కార్థికచింత లవసరములేకుండ నెట్లు సాగెను? వారార్థికవిషయముల నేమైనఁ జింతఁబూనిరా? మనకుమాత్ర మాచింత యెందులకు?' ఈప్రశ్నమున కొకసమాధానము చెప్పవచ్చును. వారందరును ప్రపంచమును జయించి గృహస్థాశ్రమమును విడిచి యడవుల వసియించుచు సంన్యాసాశ్రమముల స్వీకరించిరి. మనమో? గిట్టువఱకును ప్రథమద్వితీయాశ్రమములయందే కాలమును గడపుచున్నాము. కావున మనకాకాలమునాఁటిద్వితీయాశ్రమమైనగృహస్థాశ్రమములోనిధర్మములే యాచరణీయములు. కాని యాకాలపుటంన్యాశ్రమధర్మములు మనకుఁ బనికిరావు. మానవుని ధర్మములు దేశకాలపాత్రముల ననుసరించి మారుచుండునుగదా? పోనిండు. మఱియొకసంగతి యాలోచింపుఁడు. ఆకాలములో గృహస్థాశ్రమమున నార్థికవిషయముల చింతవలదని యెచటనైనఁ దెలుపఁబడినదా? అట్లు తెలుపఁబడనప్పుడు మనమేల వానిని విడువవలయును?

పోనిండు. ఇదివరలో ననేకశతాబ్దములనుండి మేమార్థికవిషయముల శ్రద్ధఁబుచ్చుకొనుచుండుట లేదే? మాకేమైన నష్టము వాటిల్లెనా? యని యడుగుదురా? అందులకీసమాధానము చెప్పవచ్చును.

మానవునియొక్క యుచ్చదశగాని నీచదశగాని యెప్పుడు తెలియనగును? తనస్థితితో నితరులస్థితినిఁ బోల్చికాని తనపూర్వపుస్థితితో ప్రస్తుతపుస్థితినిఁ బోల్చికాని చూచినప్పుడే తెలియనగును. మనప్రస్తుతపుస్థితి నితరదేశీయులస్థితితోఁ బోల్చి చూచినయెడలఁ బ్రపంచమంతలోను మనదేశము హీనస్థితియందున్నదని గ్రహింతుము. ఇఁకఁ బూర్వపుస్థితినిఁగూర్చి యోచింతుమా? పూర్వమీదేశ మైశ్వర్యముతోఁ దులఁదూగుటవలన నితరదేశీయులకుఁ గన్నెఱ్ఱగ నుండెను. కావున నేవిధముగఁ బోల్చినను మనకుఁ బ్రస్తుతపుస్థితి హీనముగనే కాన్పించుచున్నది. ఇట్టిహైన్యమును బోఁగొట్టుకొనుటకు మనము సర్వవిధములఁ బ్రయత్నింపవలయును. అట్లు ప్రయత్నించుటకు ముందు మనకుండు నష్టము లేవో కష్టము లేవో తెలిసికొని వానిని నిర్మూలించుకొనుటకుఁ దగినప్రయత్నములను సలుపుకొనవలయును.

మొట్టమొదట మనకు విద్య పూజ్య మయ్యెను. మనలో నూటికిఁ దొంబండ్రుపైఁగా విద్యాగంధవిహీనులై కుక్షింభరత్వమే పరమావధిగ నెంచుకొని కాలక్షేపము చేయుచున్నారు. విద్య యెందులకు? పొట్టకొఱకేగదా. పొట్టగడచుట కాధార మున్నయెడల విద్య యనవసర మనునభిప్రాయము లిప్పుడు మనవారిలోఁ బెక్కండ్రకుఁ దోఁచుచున్నవి. సృష్టిలోనిజీవకోటి యంతలోను మానవునియాధిక్యమునకుఁ గారణమేది? బుద్ధియేకదా? ఆబుద్ధిని వికసింపఁజేసికొనుట కాధారమైనవిద్య నేర్వనినాఁడు మానవుఁ డితరజంతుకోటిలోఁ దన యాధిక్యము నెట్లు నిలుపుకొనఁగలుగును? కావున విద్యాసంపాదనమునకు మానవుఁడు తగినప్రయత్నములు చేయవలయును. ఆవిద్య యెట్టిది? ఏవిధముగ నేర్చుకొనవలయును? మున్నగువిషయములను గుఱించి ముందుముందు యోజింతము.

ఈవిద్య సంపాదించుటకుఁ దగినసావకాశము సౌకర్యము ము
న్నగునవి కావలయును. ప్రపంచములోని పేదదేశములలో నొకటి
యైనమనదేశమునందు విద్యాసంపాదనమున కాధునికకాలమున ననే
కప్రతిబంధకములు గలుగుచున్నవి. ఏలయన, విద్య చెప్పించుటయ
నఁ బ్రతిమనుజుఁడు నాంగ్లేయవిద్యచెప్పించుట యనియే భావించుచు
న్నాఁడు. తదితరమైనవిద్య విద్యగా జనసామాన్యమువలన నెంచఁబ
డుటయే లేదు. దీనికొకకారణము కలదు. ఆంగ్లేయవిద్యఁ బడసి
యందుత్తీర్ణులైనఁగాని హిందువులకుఁ బ్రభుత్వమువారిపక్షమున ను
ద్యోగములు దొరకుటలేదు. కాని యీయాంగ్లేయవిద్య సులభసాధ్య
మగుటలేదు. మిక్కిలి ధనవ్యయముచేతఁగాని లభ్యము గాదు. అం
దుచే ననేకు లశక్తు లగుటవలనఁ దమపిల్లలకు దానిని జెప్పింపలేకు
న్నారు.

పోనిండు. ఆంగ్లేయవిద్య లేకపోయినఁ బోవుఁగాక. ధనవ్యయ
ము కానియితరవిద్య తేనైనఁ జెప్పింపవలెనన్నను దలిదండ్రులు పేద
వారగుటయుఁ గుటుంబము పెద్దది యగుటయు మూలముగాననేకులు
యువకులు విద్యాభ్యాసమునం దాసక్తి గలవారయ్యుఁ దమకుటుంబ
పోషణార్థము చదువును చాలించి ధనసంపాదనమునకుఁ గడంగవలసి
వచ్చుచున్నది.

పాఠశాలలో విద్యాభ్యాసము మానినను, విదేశములలోఁ బె
క్కండ్రు ప్రాపంచికవ్యాపారములయందుఁదిరుగుచు స్వోదరపోషణము
నకుఁ దగినదానిని సంపాదించుకొని కొంతసావకాశము గలుగునప్పు
డు విద్యాభ్యాసమును జేయుచున్నారు. ఇఁక మనదేశముననో? శక్తి
యున్నంతకాలము శ్రమపడినను బ్రతిమనుజుఁడును స్వోదరపోషణ
మునకుఁ దగినంత సంపాదించుకొనలేకున్నాఁడు. కావున మిక్కిలి శ్ర

మపడి వచ్చి కొంచెము విశ్రాంతిఁ దీర్చుకొనుటకైన నవకాశము లేకయే మరల కుక్షింభరవృత్తినిఁ బ్రతిమనుజుఁడు నవలంబింపవలసివచ్చుచున్నది. కావునఁ బాఠశాలలలో నేర్చుకొనినదానిని వృద్ధిచేయుటమాట యటుండ నున్నదానిని నిలుపుకొనుటకైన మనవా రశక్తులుగ నున్నారు.

శ్రమపడి నేర్చుకొనినదానికైనఁ దగినప్రతిఫలము చేకుఱుట లేదని యనేకులు నిరుత్సాహమును జెందుచున్నారు. ఏలయన బుద్ధిచాతుర్యము కార్యనైపుణ్యము మున్నగుసద్గుణము లెన్ని యున్నను దాము పాలితు లగుటవలనఁ బాలకులజాతివారి కిచ్చుచున్నయధికగౌరవపదములు ప్రభుత్వమువారు వీరికిచ్చుట లేదని వీరిమనస్సునకుఁ గన్పట్టి పిన్న లెవరైనఁ దమ్ము సలహా యడిగినయెడలఁ బ్రభుత్వోద్యోగములో మిక్కిలి లాభము లేదు. న్యాయశాదిపరీక్షకుఁ జదువుకొమ్ము. లేదా మరియొకయుపయోగకరమైనపరీక్షకుఁ జదువుము’ ని చెప్పుచున్నారు.

కాని యెవరేమిచెప్పుచున్నను, ఎన్నిప్రతిబంధకములున్నను విద్యాభ్యాస మెల్లజనులకు నవశ్యకర్తవ్యము. విద్య నెఱుంగనివాఁడు మర్త్యుఁడే? యని భర్తృహరి చెప్పలేదా?

ఈవిద్యాభ్యాసమునకుఁ దగినసదుపాయములను బొందుటకు మానవుఁడు క్రమమైన కార్యాచరణముగలిగినట్టియుఁ బూనికలో వృద్ధిక్షయములు లేనట్టియుఁ జురుకుదనము.గలిగినట్టియు వర్తనము నభ్యసించవలయును.

క్రమమైనకార్యాచరణ మనిన నేమి? మనుజుఁడు తాను జేయఁదలఁచుకొనినపనులలో ముందుదానిని వెనుకను వెనుకదానిని ముందును జేయక యొకపద్ధతి నేర్పాటు చేసికొని వరుసగాఁ బనులో

నర్చుట. ఇందువలన నరు లొనర్పవలసినపనులలో నొక్కటియు బుద్ధి నుండి వెడలిపోక యన్నికార్యములను నెఱవేర్పుటకు వీలగును.

పూనికలో వృద్ధిక్షయములు లేకపోవుట యన నేమి? సాధారణముగ జనులు నూతనకార్యములను బ్రారంభించునప్పు డుత్సాహము మెండుగనుండుట మూలమున నారంభశూరత్వముతో మిక్కిలి పూనికగలిగిపనిచేయుటయుఁ గ్రమక్రమముగా దినపూర్వజనితచ్ఛాయ వలెఁబూనికక్షీణించుచుండుటయుఁ దటస్థించును. మఱికొందఱుప్రారంభించికొంతకాలము పనిచేసినతర్వాత విసుగుజనించుటచే నిరుత్సాహులై కార్యదీక్షయందలసత వహించి కొంతకాల మింకను బనిచేయుచుండఁగ నంతలో నితరులకార్యదీక్షవలన నుత్సాహము జనించుటవలననేమి, సహజముగఁ గుతూహలము జనించుటవలననేమి, మఱియేకారణమువలననైన నేమి, యినుమడించినపట్టుదలతోఁ గార్యమును గొంతకాలము సాగించుచు మరల నలసత వహించుచు నిట్లు హెచ్చుతగ్గు పూనికలతోఁ గార్యమును గావింతురు.

ఇఁకధీరులో? ప్రారంభించినది మొదలు కార్యాంతమగువఱకు నొకేవిధమైనదీక్షతో నధికారులవలననిరసనము వచ్చిననైనను,ధననష్టమైనను, మఱి యేనష్టము వచ్చినను, ధైర్యముతోఁగార్యసాఫల్యమును గావింతురు. ఈధీరలక్షణమేపూనికలో వృద్ధిక్షయములు లేకపోవుట యని పైనివివరింపఁబడెను.

మానవుఁడు కార్యాచరణమునందుఁ బైఁజెప్పఁబడిన రెండుగుణములకుఁ దోడు చురుకుదనమును గలిగియుండవలయును. అప్పుడే పసిఁడికిఁ దావి యబ్బిన ట్లాతనిగుణములు రాణించును. ఏలయన నెన్నిసుగుణము లున్నవానికైన మాంద్యము మచ్చగ నెన్నఁబడును. మిక్కిలి ధీమంతుఁడైనను, దనజ్ఞానప్రకాశముచేఁ దనదేశమునకు వ

హోపకారముఁ జేయఁదలఁచుకొన్నవాఁడైనను మాంద్యము గలిగిన యెడల నట్టిపని కవకాశము చేసికొననేరక తనయాశయముల నన్నిఁటి నీటఁ గలిపి వ్యర్థప్రయత్నుఁడగుచున్నాఁడు. చురుకుఁదనము గలిగినవారు లబ్ధప్రయత్ను లగుచున్నారు. కావున నెల్లరు చురుకుఁదనమును నేర్చుకొనవలసి యున్నది. ఈగుణ మభ్యాసమువలన వచ్చునదియు మానవుని కలంకారమువంటిదియుఁ గాన సకలజనులు నేర్చుకొనఁదగినది.

ఇటుకకళ్లము చెట్లనీడనుండుట యావశ్యకము. ఏలయన గాఢమైనరశ్మి సోకినయెడల పచ్చియిటుకలు బీటలుతీసి రూపవిహీనములగును. ఇటుక యావేశనములలో (Brick fields) పాక లిటుకల నారబెట్టుటకుగాను వేసియుంచెదరు. ఈపాకలలో సోపానములు (పరంజాలు) కట్టబడియుండును. ఈపరంజాలమీఁద నిటుకల నారబెట్టెదరు. పాకలలో నిటుకలనారబెట్టుపద్ధతిలో మఱియొకలాభముగలదు. వర్షము కురిసినను నిటుకలు చెడవు. కొంతకాల మెండినపిదప నిటుకలను కళ్లములో గోడిని నెండఁబెట్టవలయును. అధోభాగమును చదునుగాఁ జేయవలయును. మేజయిటుకలకు నీవిధమగుమరమ్మతు చేయనక్కఱలేదు.

పచ్చియిటుక లావములో కాల్పఁబడును. ఆవములు రెండుతెగలుగా నున్నవి: స్థిరములనియు, అస్థిరములనియు స్థిరము లగునావములలో ననవరతము నిటుకలను గాల్చుచునే యుండవచ్చును. ఒకమూల నిటుకలు కాలుచుండును. మఱియొకతావున నిటుకలఁ బేర్చుచుందురు. మఱియొకతావున కాలినయిటుకల వెలికిఁ దీసివేయుచుందురు. వేనవేలుగా నిటుకలు కాల్చుటకు స్థిరములగునావములే ప్రశస్తములు. స్థిరములగునావములలో నొకటి హోఫ్మన్ ఆవమనునది.(Hoffman's kiln) ఇది చెన్నపురిలో దొరతనమువారియావేశనములో నున్నది. హోఫ్మన్ ఆవము వలయాకారమైగోడలచే నావరింపఁబడియుండును. వెలుపలిప్రాకారపుగోడచందమున లోపల నింకొకవలయాకారమగు గోడ యుండును. ఈ రెండుగోడలనడుమ నుండుస్థలముయొక్క వైశాల్యముననుసరించి 10, 12 గదులుగా విభజింపఁబడి యుండును. లోపలిప్రాకారపుగోడమధ్యమున నొకపొడుగైనపొగగొట్టము(chimney) మర్చబడియుండెను. గదులన్నియు డాబాతో మూయఁబడి వెలుపలి

కి నొకద్వారమును, పొగగొట్టమున కొకమార్గమును గలిగియుండును. ఈగదులన్నిటియందును వరుసగా నిటుకల పేర్పు, కాల్పు జరుగుచుండును. కాలుచున్నయిటుకలనుండి బయలుదేరునుష్ణవాయువులు క్రొత్తగాఁ బేర్చబడినపచ్చియిటుకలను గాయుచు పొగగొట్టముద్వారా బయటికి పోవుచుండును. ఇటుల నెడతెగక ప్రతిదినమును 10 వేలు మొదలిరువదివేలవరకు నీయావములో దాని వైశాల్యము ననుసరించి, యిటుకలను గాల్చవచ్చును. రెండు తెరగులయావములలోను నిటుకలను బేర్చువిధ మొకటే. స్థిరములగునావములలో దరచుగఁ గొట్టముల నుపరిభాగమునుండి లోనికి విడిచెదరు. అస్థిరము లగునావములలో ప్రక్కనుండి మంటవేయుదురు. ఇటుకల నావములలో గోడమీద పేర్పవలయును. ఒకవరుస విడిచి యొకవరుసయందు వంటచెరకు సమకూర్పఁబడియుండును. ఇంధనము లన్నియు నొకచోటనే బేర్పఁబడిన యెడల చుట్టునుండునిటుక లుష్ణాధిక్యతచే చిట్లముగట్టును. కొలదిగా బేర్చినచో నిటుకలకు తగినంతయుష్ణము తగులమి నవి బాగుగాఁ గాలఁజాలవు. ఇటుకావ మిటుకలతోఁ బేర్పఁబడిన నిడుపైనగూళ్లపైనఁ గట్టఁబడును. ఈగూళ్లపైన రెండవదియగువరుసయందు వంటచెరకును విశేషముగాఁ బేర్చవలయును. ఆవ మెత్తైనకొలఁదిని వంటచెరకును తగ్గించుచురావలయును. ఇటుల చేయుటవలన నుష్ణవాయువుల వేఁడిమి బహుస్వల్పముగా వ్యర్థమగును. 1000 ఇటుకలు కాల్చుట కొకబండికలప అనఁగా 4½ మణుగులకలప కావలయును. ఇటుకలయొక్క పరిమాణము ననుసరించియు, కలపయొక్క యుష్ణోద్దీపనశక్తి (Calorific power) ననుసరించి యుండును. చింతమ్రాను, సంగీతపుచెట్టు ఆవములుకాల్చుటకు ప్రశస్తములైనవి. కొన్ని తెరగులయారణ్యపాదపములును వీటివలె నుష్ణోద్దీపనశక్తికలవియును గలవు. ఆవము

పేర్చినతోడనే లోపలికి గాలిచొరకుండునటుల దద్దళము వేయుదురు. స్థిరములైన యావములలో కాష్ఠములు మందగతిని దహనమగునటుల నిచ్ఛానుసారముగ గాలిని లోనికి జొరనిచ్చుటకుఁ దగినసదుపాయము లమర్పఁబడియుండును. సామాన్యపుఆవములయందు దుంగ లంటు కొనినవెంటనే యగ్గిగుంటినోళ్లను (flues) మంటిచే గప్పివేయుదురు. ఇటుకలరంగును, కాఠిన్యతయు, బలమును నిటుకలను కాల్చునేర్పునను సరించి యుండును. ఉష్ణతామాపక (Thermometer) సహాయమున నుష్ణాధిక్యతను గ్రహించి యగ్నిముఖములను దెరచియు మూసియు స్థిరఆవములందు నిటుకలను బాగుగ కాల్పనగు. ఆవము కాలుచున్న తఱి గాలి త్వరితగమనమున నావముఁ జొచ్చును. ఇటుకలు కరగి యొండొకటి కలిసి చిట్లము కట్టిపోవును. కొన్నియిటుకలు కాలకయు నిల్చిపోవచ్చును. ఇటుకలు కాలినపిదప ఆవమును మందముగా చల్లా ఱనీయవలయును. లేనియెడల నుష్ణాధిక్యతమీఁద చలిగాలి రివ్వన సోకిన నిటుకలు బీటలుదీయును.

చిట్లముకట్టినయిటుకలు గాజువలె కాఠిన్యములైయుండు. ఇటుకలు కాలుచున్నసమయమందున నుప్పు వానిమీఁదఁ జల్లినచో వాని యుపరిభాగమంతయుఁ గాచస్వాభావికమగును. కాచోపరితములైన (glazed bricks) యిటుకలు, చవుడు, ఉప్పుగాలి, జంతువిసర్జితమూత్రాదికములచే నశింపక దృఢమై నిల్చును.

## సున్నము.

గృహనిర్మాణమం దిటుకలుమున్నగుపదార్థముల నొండొంటిఁ జేర్చుటకు నొకజిగురుపదార్థ మావశ్యకమై యున్నది. శిల్పి యీజిగు రుపదార్థమును బొడిసున్నము నిసుకయుఁ గొలఁదినీటితోఁ జేర్చి చే యుచున్నాఁడు. ఇట్టిజిగురుపదార్థమునకు గచ్చుసున్నమని పేరు. గచ్చు

సున్న మారి గట్టిపడి కాలక్రమమున శిలవలెఁ గాఠిన్యతఁ జెందుస్వ భావము గలదియై యున్నది. మానవుఁడు గచ్చుసున్నమును జేయు మార్గమును సృష్టియందుఁ గనఁబడుసైకతశిలలనిర్మాణముం బరీక్షిం చుటచే గ్రహించియుండవచ్చును. ఈశిలలం బరికించిన వానినిర్మాణ మందు సైకతకణములు జిగురుపదార్థముచే నొండొంటి జేరి ఘనీభవిం చియున్నవని తెలియనగు.

సున్నము సృష్టియందు బాహుళ్యముగా దొరకుసున్నపురాల నుండియు సున్నపుగుల్లలనుండియుఁ జేయబడుచున్నది. సున్నపురాళ్ళ విషయమై శిలాప్రకరణమందుఁ జెప్పియున్నాము. సున్నపుగుల్లలు జీ వజపదార్థము (Organic matter) నత్తగుల్ల లాలుచిప్పలు మొదల గునవి చిన్నపురుగులకునికిపట్టై వానిచే నుత్పత్తియగుట మనము చూ చుచున్నారము గదా! అటులనే సముద్రమందును క్రిమివిశేషములు గుల్లల నాత్మరక్షణమునకై స్వభావముచే నుత్పత్తిఁ జేయుచున్నవి. గుల్లలు తొలిసముద్రాక్రాంతములై ప్రస్తుతము నిర్జలములగుప్రదేశ ములందుఁ గన్పట్టెడిని. గుల్లలను భూమిలోనికి సొరంగములఁ ద్రివ్వి వానినుండి యెత్తెదరు. గుల్లలను భూమినుండి యెత్తునపుడు మంటితోఁ గలిసియుంటచే జక్కగఁ గడిగి పరిశుభ్రము చేయవలయు. సున్నపు రాలనుండియు, గుల్లలనుండియు బొడిసున్నము జేయువిధ మొక్కటి యే. సున్నపురాళ్ళను. గుల్లలను బట్టీలందుఁ గాల్చెదరు. సున్నపుబట్టి (Lime kiln) వలయాకారమై నిడుపై యుండును. గర్భము దోస కాయవలె వాటముదేరి యుండును. దిగువున మూడుగాని నాలుగు గాని మార్గములు కట్టఁబడియుండును. ఉపరిభాగము తెరచియుండును. రాళ్ళను గాల్చుటకు బొగ్గు, రాక్షసబొగ్గు, సామాన్యమైనవంటచెర కుఁగూడ నుపయుక్తమగు.

అట్టడుగున బొగ్గు నొకవరుసయు దానిపై సున్నపురాల నొకవరుసయు, రాలపై బొగ్గు నింకొకవరుసయు నిట్లు బట్టినిండువరకుఁ బేర్చెదరు. చితిని బేర్చునిపుణత ననుసరించియే సున్నపురాలకాలుటయునుండు. రాళ్లు బాగుగఁ గాలనియెడల నవి పొడిసున్నము గానేరవు. చితింబేర్చినపిదప బట్టీయొక్కయుపరితలమున మట్టితో దద్దళము వేయుదురు. ఇటుల జేయనియెడల నతిత్వరితముగ వంటచెరకంతయు దహనమై వేడియంతయు రాళ్లను గాల్చుటకు నుపయోగము కానేరదు. బట్టీ కాలి చల్లగ నారినతోడనె క్రిందనుండుమార్గముల వెంబడిని కాలినరాళ్ల నీవల కీడ్చెదరు. బట్టీల నెడతెగక రాళ్లను గాల్చుచుందురు. అధోముఖమున కాలినరాళ్లు బహిర్గతములు కాఁగా నూర్ధ్వముఖమున క్రొత్తరాళ్లను బొగ్గును లోనికి దింపుచుందురు.

బట్టీల నలుచదరముగ గట్టుటయు నాచారమై యున్నది. చదరపుబట్టీయొక్కగర్భమం దధోభాగమున నడుగున్నర వెడల్పును, అడుగున్నరయెత్తును గలలాజు (Arch) గట్టబడి యుండు. ఈలాజుపరితలమందు గాలిబారుటకు గాను సందు లమర్పబడియుండు. ప్రక్కగోడలయందును లాజుచేఁ గప్పబడినద్వారములు విడువఁబడును. లాజులపైనఁ బెంకుముక్కలను పేర్చివానిపైన మూఁడంగుళములు మొదలారంగుళములయెత్తువఱకును బొగ్గునుఁ బేర్చెదరు. బొగ్గునకు నిప్పంటించి యది బాగుగ రగిలినతరువాత సున్నపురాళ్లను, బొగ్గును గుప్పగుప్పలుగ గుమ్మరించెదరు. కుప్పలంటుకొనినమఱికొన్నిరాళ్లను బొగ్గును వేయుదురు. ఇట్లగ్ని యూర్ధ్వముఖమై వ్యాపింప బట్టీ నిండువరకు రాళ్లను బొగ్గును వేయుచుండెదరు.

ఎన్నిరాళ్ల కెంతబొగ్గు వేయవలయునది వాటియొక్కస్వభావమున ననుసరించి యుండును. కొన్నిరకములవంటచెరకున నుష్ణత విశే

షించి యుండును. కొన్నిటికి తక్కువగ నుండు. రాళ్లను బొగ్గును సమభాగములుగా వేయవచ్చును. రాక్షసిబొగ్గు నుపయోగించిన రెండుపాళ్లు రాళ్లు, నొకపాలు బొగ్గు వేయుటయుఁ గలదు. గాలివీచుప్రక్క బట్టీద్వారములఁ దెరచియుంచి రెండవవైపున ద్వారములను మూసియుంచవలయును. లేనిచో సున్నమంతయు గాలిపాలగును. సున్నపురాళ్లు స్వచ్ఛములైనయెడల రాళ్ల నెంతకాల్చినను, సున్నము చెడదు. మంటిపాలు గలిగినసున్నపురాలను పదునుమీరి కాల్చినయెడల నట్టివానియొక్కయుపరిభాగమంతయు గాజుగా మారి రాళ్లుసున్నము గానేరవు. కాన సున్నముఁ గాల్చువారలు రాళ్లస్వభావమునుఁ దెలిసికొనియుండవలయును.

బట్టీయొక్కగోడలు దృఢమై, దట్టమై యుండవలయును. లేనిచో బట్టీ రాళ్లభారమును మోయజాలదు. ఉష్ణము గోడలవెంబడిని వెలికిబోవును.

చదరపుబట్టీ 60 తొట్టెలవైశాల్యము గలిగియుండనోపును. తొట్టియనఁగా 20 అంగుళములనిడుపు, 10 అంగుళములవెడల్పు 10 అంగుళములలోతును గలయొకకొలతపెట్టె. సున్నపుగుల్ల 40 తొట్టెలును, బొగ్గు 20 తొట్టెలును బట్టీయందు నొకతడవ వేయవచ్చును. బట్టీ కాల్చుటకు 12 గంటలకాలము పట్టును. ఆరుటకు 48 గంటలకాలము పట్టును.

గోదావరియానకట్టలలో నొకకట్టకు సున్నముకాల్చినబట్టీనుండి దినమునకు నలువదిగరిసెలసున్నము తీయబడుచుండెను. గరిసెయనగా 60 తొట్టెలు. (40 తొట్టెలగరిసెయు గలదు) ముప్పదిమూడుతొట్టెలరాళ్లను గాల్చుటకు 300 పౌనుల (12 మణుగుల) బొగ్గును 3000 పౌనుల (120 మణుగుల) వంటచెరకు నుపయోగించుచుండిరి.

గుల్లలయొక్కయు, సున్నపురాళ్ళయొక్కయు ముఖ్యమైనమూలపదార్థ మొకటియై యున్నది. దీనిని రసాయనశాస్త్రమందు (chemistry) ఖటికకర్బనిత (Calcium carbonate $CaCO_3$) మం దురు.

ఖటికకర్బనితమును రెండుపదార్థములుగ విభజింపనగును. అవి యెవ్వియనిన అంగారవాయువును ($CO_2$) ఖటికామ్లమును (CaO) ఖటికామ్లము నీటితో మిశ్రమైన పొడిసున్న మగును. ఈపొడిసున్న మే శిల్పికి నావశ్యకమైనపదార్థము.సున్నము స్వచ్ఛము (Fat or pure) వారుణము (hydraulic) ని రెండు తెగలుగ నున్నది. బాహుళ్యముగా గుల్లసున్నము స్వచ్ఛమైనదియు, రాతిసున్నము వారుణమునై యున్నవి. శైలతమగుమంటియొక్క చేరిక చేత నే రాతిసున్నము వారుణస్వభావము గలిగియున్నది. నీటిలో ఘనీభవించుటయే వారుణతము, వారుణసున్నము స్వచ్ఛసున్నముకంటె బలవత్తరము. రాతిసున్నములును స్వచ్ఛములైనవి గలవు. సున్నపురాతి నెఱ్ఱగఁ గాల్చినరాతియం దుండునీరును ఖటికామ్లముతో మిశ్రమైయుండునంగారవాయు వెగిరిపోవును. నిలిచియుండుపదార్థమే ఖటికామ్లము. గుల్లలను కాల్చినశుద్ధఖటికామ్లము తేరును. రాతిసున్నములో నితరపదార్థములు నుండును. ఖటికామ్లముపైని నీటిని జల్లిన నది రసాయనమార్గమున నీటితో మిశ్రమై పొడిసున్న మగును. నీరు విశేషముగఁ బోసిన తడిసున్న మగును. పొడిసున్నమే గచ్చుసున్నము చేయ నుపయోగమగును. వారుణసున్నము బాగుగ బొడిగానేరదు. గనుక సున్నమును జల్లించి పొడిని గ్రహించి మిగిలినరాళ్లను విసర్జించెదరు. ఈరాళ్లను తిరిగి కాల్చి పొడిచేయుటయు కలదు. కొన్ని సమయములం దీరాళ్లను (అరవములో వీనిని కప్పీయందురు.) గానుగ

యందు మెత్తగ నూరి గచ్చుసున్నమున కుపయోగించుటయు గలదు. ఆ 1874 సంవత్సరమున దొరతనమువారిచేత నీరాజధానియందు దొఱకుసున్నపురాళ్లగుణముల పరీక్షించుటకై నియమింపబడిన నికోలీసన్ (Nicholson) అనునాతఁడు వారుణసున్నమునుగురించి యిట్లు వ్రాసియున్నాఁడు. "పరిశస్తమైనవారుణసున్నము చేయవలెనన్న కాలినరాళ్లను నీరుపోయకమునుపు గానుగలో నూరి బాగుగ పొడిచేయవలయును. పొడిసున్నమును చేసినపిదప కప్పీని చూర్ణముచేయుటలో లాభము లేదు. కాలినరాళ్లను గానుగయం దాడి తరువాత నీళ్లు చల్లి పొడిసున్నము చేయవలయును." స్వచ్ఛసున్నము నిచ్చురాళ్ల నీవిధమున బొడిచేయ బ్రయోజనము లేదు. కాలనిరాళ్లను పొడిచేయగూడదు. బాగుగా కాలినవారుణపురాళ్లనుమాత్రమిట్లు పొడిచేయనగును. సున్నపురాళ్లయొక్క రసాయనసంఘట్టనము తెలిసికొనువిధమిట్టిదనిన పరీక్షచేయదలచినరాళ్లను కొంచెమెత్తి చూర్ణముచేయవలయును. ఒకగాజుకుప్పెయం దొకయరతులముచూర్ణమునుంచి యుదజహరికామ్లమును (Hydrochloric acid) (ఇది మందులషాపులయందు దొఱకును.) చూర్ణముపైని పోయవలయును. రసాయనమిశ్రమమున ఖటికహరిదము ($cacl_2$) కర్బనద్వ్యమ్లజనిదము ($co_2$) జలము ($H_2o$) నేర్పడును. అంగారవాయువు వాతావరణమును (atmosphere) చేరును. ఖటికహరిదము నీటిలో గరగిపోవును. గనుక మిగిలినమట్టియు నిసుకయు గాజుకుప్పెయడుగున జేరును. ఈ సత్తును (Sediment) వడియగట్టి తూచిన రాతిచూర్ణమునం దెంతఖటికకర్బనితమున్నదియు, నితరపదార్థ మెంతయున్నదియు తెలిసికొనగలుగుదుము. ఖటికకర్బనితములో నూటికి 56 వంతులు ఖటికామ్లపు పాలు.

విస్తారముసీటిని వాయువులోని కావిరిరూపమున వదలుచెట్లక్రింద చౌడు విస్తారముగఁ బుట్టునని యూహింపఁదగియున్నది. మరియు చెట్టుయొక్క పైభాగము పెద్దదిగను విస్తారముసీటి నావిరిరూపమున వదలునదియు నై వేళ్లు వ్యాపించుప్రదేశము తక్కువయినయెడల నచట చౌడు త్వరలో బయలుదేరును. వేళ్లు నేలలోనికి లోతుగాఁ బోక వెదురువేళ్లవలె పైభాగముననే యుండునెడల గూడ త్వరలో చౌడుపుట్టుట కెక్కువయవకాశము గలుగును. కొన్ని నేలలలోను, కొన్ని చెట్లక్రిందను త్వరలో చౌడుపుట్టుటకును కొన్ని నేలలలోను కొన్ని చెట్లక్రిందను నంతత్వరలో పుట్టకపోవుటకును గారణముల నింకను బాగుగఁ బరిశోధింపవలసియున్నది. ఈవిషయమై రైతులయనుభవములను పత్రికాముఖమునఁ దెలిపిన నుపయోగకరముగ నుండును.

× × × × ×

అరటితోటలను వేయుటలో రెండుపద్ధతులు గలవు. గోదావరిజిల్లాలో 14, 15 అడుగులదూరమున రెండేసిపిల్కలను పాతి యొక్కొక్కబోదిలో పెక్కుపిల్క లుంచుదురు. దక్షిణాదిని (చెంగల్పట్టు దక్షిణార్కాడుజిల్లాలలో) 7, 8 అడుగులదూరమున నొక్కొకపిల్కయే పాతి గెలవేయువరకు రెండవపిల్క నుండనీయరు. మొదటిపద్ధతిలో చెట్లమధ్య నేలను దున్నుచుందురు. 7, 8 అడుగులదూరమున వేసినతోఁటలలో మొక్కలు గజమె త్తైదిగినపిమ్మట దున్నవీలుగాదు. పారలతో త్రవ్వవలసియుండును. ఇందునకు కొంతసొమ్ము వ్యయమయినను నీపద్ధతివలన నెక్కువలాభము గలదు.

× × × × ×

తోఁటలో నీరుకట్టునపుడు చెంగల్పట్టుజిల్లాలో నేలను మళ్లుగా విభజించి మళ్లలోనికి నీరుపెట్టుదురు. ఇందు చాలనష్టము గలదు. నీ

రెక్కువకావలసివచ్చుటయే కాక నీరుపెట్టిననేల గట్టిపడి తఱచు గొప్పుత్రవ్వవలసియుండును. ఇట్లుకాక ప్రతి రెండువరుసలమధ్యను, నడుగులోతుకాల్వలు చేసి యందు నిండుగ నీరుపెట్టుచువచ్చినయెడల మొక్కలవేళ్లునీటిని దీసికొని బాగుగఁ బెరుగును. తఱచు గొప్పుత్రవ్వవలసినపనిలేదు. కాల్వలు త్రవ్వుటకు మొక్కలు పాతినపుడే యినుపనాగలితో చాళ్లు పోసి తూమంటెని దీసివేయుచు నిట్లు రెండుమూడుసార్లాచాలులోనే నాగటిని పోనిచ్చినయెడల వ్యయమంతగా గాదు. తెలుగుజిల్లాలవారు నీరుకట్టుటయం దీమార్పుతో దక్షిణాదిపద్ధతి నవలంబించినయెడల మిగుల లాభకరముగ నుండును.

6. "భూపుత్రి" యనుచోట "పుత్రీ" శబ్ద మౌచిత్యమునకుం బొసఁగియుంటమింజేసి రసభంజకముగ నున్నయది. ఇది పుత్రిపదమునకు జీబంతస్త్రీలింగరూపము. పుత్రుఁ డనఁగా దండ్రిని బున్నామనరకమునుండి కాచువాఁడని యర్థము. పుత్రియు నట్టిది—శ్లో॥ "పుత్రాచ్ఛతగుణంపుత్రీ యదిపాత్రే ప్రదీయతే" తగినవాని కిచ్చెనేనిఁ బుత్త్రి పుత్త్రునికంటె నూఱుమడుంగు లెక్కుఁడని ధర్మశాస్త్రము బోధించెడిని.

శ్లో. "నబ్రహ్మవిద్యానచరాజ్యలక్ష్మీస్తథాయథేయంకవితాకవీనాం
లోకోత్తరే పుంసినివేశ్యమానా పుత్త్రీవహర్షంహృదయెతనోతి."

లోకోత్తరుం డగువరున కొసంగినపుత్రివలె నుత్తమనాయకుని కిచ్చినకవితాకన్య హృదయమునకు సంప్రీతిం గలిగించునట్లు బ్రహ్మవిద్యయొండె రాజ్యలక్ష్మియొండె నానందంబొసగం జాలవు" అని జయదేవమహాకవి చెప్పినచొప్పునం బుత్త్రుఁడును బుత్త్రియు నుభయలోకతారణప్రవీణు లనుట సుప్రసిద్ధము. భూపుత్త్రి యనుసమాసమువలన నిట్టియర్థ మపేక్ష్యము కాదు. "భూసుత" "భూజాత" యనునర్థము గలపద మిచట నుండినం జాలును. పర్యాయపదప్రయోగము సేయునపుడు శబ్దార్థము మఱువక యౌచిత్యమునకు భంగము గలుగకుండునటుల రచియింపనగు. "ఇంద్రుఁడును శత్రువుచే నోటువడియె" నన్నచో నిచ్చట నింద్రశబ్దము కేవల మౌచిత్యభంజకము. ఇంద్రశబ్దము "ఇదిపరమైశ్వర్యే" అనుధాతువువలనం బుట్టిన దగుటచే మహావైభవసంపన్నుఁ డని యర్థమిచ్చును. ఇట్టిచోటులఁ బాకశాసనాదిపదములు చక్కఁగ నౌచిత్యపోషకంబులుగ నుండు. పాకుం డనుప్రబలరాక్షసవైరిని జయించినవాఁడు నయితము శత్రువులకు నోడుట వింతయగుం గాక. పరమైశ్వర్యముగలవాఁడును విజతుం

డయ్యెననుటవలన రసము లేదు.

7. "స్వవీలాభివ్యక్తి" యనియు "అంఘ్రిరేణుభవకన్యాలీల" యనియు ద్విరుక్తిగ "లీలా" శబ్దము ప్రయుక్తంబయి పునరుక్తిదోషమునకు హేతువయ్యెడు. సీత, మహారాజకుమారి యై సకలసంపద్విలాసశాలిని యగుచు విరాజిల్లునది. అహల్య మునిభార్య. శుద్ధసత్త్వవిరాజిత. వల్కలధారిణి. సీత నిజరూపప్రతిబింబమునుఁ జూచుతఱి నహల్య యనుభ్రమ గలుగుట కవకాశము గలుగునంత కవకాశము లేదు. దానంజేసి యీపద్యమునందలికల్పన యంత సమంజసముగ నున్నట్లు గన్పట్టదు. రెండవ "లీలా" శబ్దమునకు మారుగ రూపశబ్ద మున్నం 'బొసఁగునని తోఁచెడిని. అందుచేతం బునరుక్తి నివారణమగు.

8. శ్లో. "గుణదోషౌ బుధోగృహ్ణన్నిందుక్ష్వేళా వివేశ్వరః। శిరసాశ్లాఘతేపూర్వం పరంకంఠే నియచ్ఛతి॥ (రసికులు కావ్యమునందలిగుణమును, దోషమును, యీశ్వరుఁడు చంద్రుని హాలాహలంబునుం బోలెఁ గ్రమంబున శిరసావహించి దిగ(మ్రింగుదురు) అనుపలుకు పాటింపక మహాకవియగు రామరాజభూషణునితప్పు లెన్నసన్నద్ధుఁడ నగుచున్నవాఁ డని నన్నుఁ గొందఱు తలంపవచ్చును. అది సత్యమే. అంతరధ్వాంతప్రచండమార్తండు లగుకవిప్రకాండులదోషము లెన్ను వారియుద్దేశమును గనిపెట్టవలయు. ఇందులకుఁ గాళిదాసు శాకుంతలమునందలినాందీశ్లోకవ్యాఖ్యానావసరమున రాఘవభట్టసుధీంద్రులవక్ష్యమాణవాక్యరత్నమే నాసమాధానము. "ఇదంచ మహాత్మ దూషణోద్ఘాటనం స్వగుణోద్ఘోషణమివాత్యంత మనుచితమపి వ్యుత్పిత్సూనాం బాలానామూహాపోహాజ్ఞానేన వ్యుత్పత్తిమాధాతుం కృతమితి జ్ఞేయమ్" మహాత్ములదోషముల వెలిపుచ్చుట స్వగుణములఁ బ్ర

కటించుకొనుటవలె నత్యంత మనుచితం బయ్యెను వ్యుత్పత్తిజ్ఞానముం గొరెడుబాలురకు నూహాపోహజ్ఞానముచే వ్యుత్పత్తి గలిగింప నిల్లు చేసితినని తెలియునది. డానంజేసియే మమ్మటు, వాగ్భటాదిమహా పండితులు తమయలంకారశాస్త్రములందు దోషపరికరణంబుల మహా కవులశ్లోకంబుల నుదాహరించిరి. మఱియు నికావ్యంబు విమర్శించు తఱి నలంకారశాస్త్రముం బ్రమాణముగఁ జేసికొని గుణదోషవివరణ మొనర్చువాఁడను గాని స్వప్రతిభామానాభిమానంబున నెద్దియు వ్రాయువాఁడను గాను. కావ్యవిమర్శన మొనర్చుటకు గీర్వాణభాషయం దున్నన్ని ప్రామాణికగ్రంథములు మఱియెచ్చటను లేవని నానమ్మకము.

2. సీ. సకలలోకాభినంద్యకలాకలాపంబు
దొరయునెమ్మోముచందురునితోడ
బహుదివ్యఫలపరిపాకసౌభాగ్యంబు
నెరపునెమ్మోవిమానికముతోడ
నవవయశ్శ్రీనిధానంబులై తగునురో
భవసుధాపూర్ణకుంభములతోడ
నమ్లాననవమాలికాభిరూప్యము దాల్చు
లలితభుజాకల్పలతికతోడ

గీ. నదరి జనకాబ్ధిసీమ రామాభిధాన
హరి కహీనగుణప్రీతహారశరాస
గిరిమథనయత్నమున సిరి యశేష
రాజ్యము లొసంగుఁ దిరుమలరాయమణికి.

1. పైపద్యమున సీతాదేవికి లక్ష్మీత్వ మెంతయు సొంపుగ వర్ణింపఁబడియె. "రాఘవత్వే భవత్సీతా రుక్మిణీ కృష్ణజన్మని" అను

<u>నెప్ట్యూనును (Neptune) గనుగొనిన విధము</u>:—ప్రథమసంచిక లోనివ్యాసమునందు కెప్లరునియమములఁగూర్చి వ్రాయబడెను. మొదటినియమము "గ్రహము లన్నియును సూర్యుఁ డొకకేంద్రమందు (Focus) గలయండవృత్తరేఖలయందు (Ellipses) దిరుగును." ఇట్లు తిరుగుట భౌతికతాకర్షణకు (Gravitation) ఫలమే. ఇతరగ్రహము లాకర్షింపకయుండెనేని గ్రహగతులలెక్కించుట కేమియుఁ గష్టము లేదు. ప్రపంచమందలియన్నివస్తువులును ఒకటినొకటి లాగుకొనుచునే యున్నవి. కాన దగ్గరనున్నవానియాకర్షణమును గణింపనియెడల గ్రహగతులలెక్కలు తప్పిపోవును. మిక్కిలిదూరముగా నున్న నక్షత్రములు మొదలైనవాని లెక్కింప నగత్యములేదు. దూర మెక్కువైనకొలఁది నాకర్షణము మిగుల తగ్గిపోవును. ఒకగ్రహముగతిని లెక్కించునపుడు దానిపై సూర్యుఁడును, నితరగ్రహములును బ్రయోగించునాకర్షణశక్తిని వేర్వేర గణించి సమాధానపఱుపవలెను. అప్పటికిని సరిపోకపోయినయెడల నీక భేదము గలుగుటకుఁగారణము లెన్నియున్నవి అన్నిటిని దీసికొనవలెను. సాధారణముగా లొంగకపోదు. ఇది సులభమైనదియుఁ గాదు. 600 పైగా గ్రహములును, ఉపగ్రహములును తోకచుక్కలును ఉల్కలును ఆకర్షించుచుండఁగా గ్రహస్థితులను లెక్కించుట మిగులకష్టము, ఇన్నిటిని లెక్కసేయలేనివారెప్పటికప్పుడు దృక్సిద్ధమైనగ్రహస్థితులఁ బరిశీలించి సూత్రములప్రకారము వచ్చినలెక్కతోఁ బోల్చి సరిపోకపోయినయెడల నొకబీజమును గల్పించి దాని గలుపుచుండిరి. ఇది హిందూదేశమందలియాచారము.

అప్పటికప్పటికి గ్రహములస్థితినిబట్టి తాత్కాలికమగునట్టి గ్రహగతులు భేదించుచుండును. న్యూటను (Newton) చనిపోయినత

ర్వాత లేగ్రింజి యనునాయన గ్రహగతులభేదముల నెప్పటికప్పుడు గ్రహస్థితులు వానియాకర్షణాలు వీనివలనఁ గలుగుభేదములనుబట్టి లెక్కవేయనారంభించెను. యూరేనసను గ్రహమును గనిపెట్టినచాల కాలమునకు క్రీ.శ. 1820 లో అలెక్సిస్సుబొవర్డు (Alexis Boward) అనునాయన గురు, శని, యూరేనసులగతులభేదము లన్నిటిని దీసికొని యొక్కపట్టిని బ్రచురించెను. గురుశనులగతులు దృగ్గోచరమగు దానికి సరిపోయెనుగాని యూరేనసుగతి సరిగా నుండలేదు. బెస్సెల్ (Bessel) అనునొకగొప్పజ్యోతిష్కుఁడు దీనిగూర్చి విపులమైనచర్చఁ జేసెను గాని ఫలము లేకపోయెను.

హుస్సేయనుపాదిరి యూరేనసున కావల నొకగ్రహ ముండి యూరేనసుగతిని మార్చుచున్నదేమో యని మొదట సూచించెను. దానిపై నేమియు చర్చజరుపఁబడలేదు. దీనినే నికోలి యనునిటలీజ్యోతిష్కుఁడు బలపఱచెను. గాటింజను (Gottingen) రాయల్ సొసయిటీవారు యూరేనసుగతులను శాస్త్రముతో నన్వయింపఁగలవారికిగొప్పబహుమతిజేతుమని 1843సం॥లో ప్రకటించిరి. 1842సం॥లో బెస్సెలు ఇంగ్లాండు వచ్చినపుడు హెర్షెలుతో నెప్ట్యూనసకావల నొకగ్రహ ముండియుండవలెనని చెప్పి దాని గనుగొనుటకు దీర్ఘమైనచర్చ జరుపఁబూనుకొనెను. ముగియుపూర్వమే చనిపోయెను. 1843 వసంవత్సరమున జాన్ కౌచ్ ఏడమ్సు (John Couch Adams) అనునింగ్లీషుగణితశాస్త్రజ్ఞుఁడు పట్టపరీక్షనందినవెంటనే యీవిషయమునుగూర్చి చాలపరిశ్రమచేసి 1845 సంవత్సరములో గ్రీనిచ్ నక్షత్రశోధనశాలాధికారికి యురేనసుగతికిని బొవర్డు వ్రాసినపట్టీలకును గలభేదమును పూర్ణముగా విశదీకరించుచు నావల నొకగ్రహము గలదని దానిప్రస్తుతపుస్థితిని దెలుపుచు నొకవ్యాసమును వ్రాసియుంచెను.

ఇపుడే ఫ్రాన్సుదేశమందు లెవెరియర్ (Leverrier) అనుజ్యోతిష్కుండు దీనింగూర్చి 1845లో నొకటియు 1846లో నొకటియు వ్యాసములను వ్రాసి పారిసుశాస్త్రసభకుం బంపెను. లెవరియరుగణనకును ఏడమ్సు గణనకు భేదము మిక్కిలి లేనందున గ్రీన్విచ్ జ్యోతిష్కుండు (Airy) ఎయిరీఅనునాయన చాలీసుఅనునాయనను గ్రహమును గనిపెట్టుటకు నియమించెను. ఈయన గ్రహమును జూచియు, అది గాదనుకొని కనబడలేదని వ్రాసెను.

1846 లో లెవరియర్ ఆగష్టునెలలో నింకొక వ్యాసమును వ్రాసి వెంటనే బెర్లిన్నక్షత్రశాలకు గ్రహమునుగూర్చినవిషయములం దెల్పుచు దానిం గనిపెట్టంగోరెను. అప్పటికపుడే జర్మనీదేశమందు నాకాశమునందలినక్షత్రములపటములు కాంతితారతమ్యమును బట్టి వ్రాయంబడియుండెను. గ్రహము నక్షత్రపటములయందుండదు. పటములో లేని దేదైనం గనంబడిన నది నక్షత్రము గాదని నిశ్చయింపంగలిగియుండిరి. వార్త తెలిసినవాండె వారు క్రొత్తదానినొక దానిని లెవరియరు సూచించినప్రదేశమందుం గనిపెట్టంగలిగిరి. వెంటనే యది గ్రహమని నిశ్చయింపంబడెను. వార్తాపత్రికలయందుమా దేశస్థులే ముందుగాం గనిపెట్టిరని ఘోరమైనయుద్ధము కొన్నాళ్లు నడచెను. ఇది ముఖ్యాంశము గాదు. లెక్కవలననే నూతనగ్రహమును గనిపెట్టుట లోకమునంతను నసాధారణమైనయాశ్చర్యమున ముంచి వేసెను. తర్వాత కొంతమందిజ్యోతిష్కులు ఇద్దరును తప్పుదుత్రోవనే వెళ్లిరనియు, గ్రహము గనంబడుట తాటస్థ్యమనియును నుడివిరి గాని యది కేవలము నీర్ష్యాజనితముగా నాలోచింపవచ్చును. అన్ని సంగతులును దెలిసినగ్రహములగతులే దురవగాహములగుచుండ యూరేనసుగతికిం గలభేదములు గాక వేరాధారము లేనప్పుడిట్టిగణనకుం

గడఁగుటయే యాజ్యోతిష్కులయసాధారణధైర్యసాహసములకుఁ దార్కాణము. అవిమాత్రమే వారి కుండినగుణములు గావని వారు విశదీకరించినవిషయమే సాక్షి.

ఈగ్రహము సూర్యునికి 279,60,00,000 మైళ్లదూరమున నున్నది. భూమికంటె 230 రెట్లు బరువుగలది. 37000 మైళ్లవ్యాసము గలది. 164 సంవత్సరములలో సూర్యునిచుట్టు తిరుగును. దీనికి త్రోవను ఎప్పటికప్పుడు మార్చుకొనుచున్న నుపగ్రహమొకటి గలదు. దీనిఁబట్టి యీగ్రహము తక్కినగ్రహములకంటె నండాకారముగా నున్నదని తెలుచున్నది. నిరక్షవ్యాసము అక్షవ్యాసముకంటె మిగులఁ బొడవు.

భూగ్రహమున కీవ్యాసములతేడా 26 (miles) మైళ్లు. (గ్రహములన్నియును అక్షముపైఁ దిరుగుచున్నవి. ఈతిరుగుటవలననే గ్రహముల నిరక్షరేఖ పైపై కుబ్బును. నెప్ట్యూ నింకను మెత్తగా నున్నదనియును, మిగుల వడిగా దిరుగుచున్నదనియును శాస్త్రజ్ఞు లూహించుచున్నారు. నిరక్షవ్యాసము మిగుల పొడగగుట కిదియే కారణము.

మిక్కిలిదూరముగా నుండుటచే కంటి కీగ్రహ మగుపడదు. సాధారణదుర్భిణులయందైన నక్షత్రములకంటె భిన్నముగాఁ గనఁబడదు. దీనిని కంటితోఁ దక్కినగ్రహములవలెఁ గనిపెట్టలేకపోవుట కిది యొకకారణము.

కెప్లరు నియమములును అదివరలో గ్రహగతులగూర్చినప్రస్తారములును—జ్యోతిర్గణితముయొక్కయాథార్థ్యత కింతకుమించినరుజువు మరియొకటి లేదు.

# విజనసదనము.

## ప్రథమాధ్యాయము.

ప్రదోషవేళ.

పురుషసింహుఁడు పదునెనిమిదేండ్లవయస్సువాఁడు. ఆతనిశరీరపుఁజాయ చామనచాయ. ఒకటిరెండేండ్లక్రిందట నతనిని మిక్కిలి పొట్టివానిగ భావించి వామనావతారుఁడని మిత్రులధిక్షేపించుచుండెడివారుకాని పదునెనిమిదవయేఁడు రాఁగానే యతఁడు జువ్వవలెఁ బెరిగి చూపఱ కచ్చెరువుగొల్పుచుండెను. అయినను పొడుగునకుఁ దగినట్లొడలుచేయకపోవుటచే నతఁ డొకించుక బలహీనునివలెనే తోఁచుచుండెను. మోమున నూనూఁగుమీసము లప్పుడప్పుడే పొడకట్టుచుండుటచే మిక్కిలిసొంపుఁజూపింపకపోయినప్పటికి నవయౌవనప్రశోభను బగటుచున్నవి.

అట్టివయఃప్రభాతప్రసిద్ధమగుతఱి మఱియొండుకఱకటి యొద్దియు లేనియెడఁ బూరుషుఁ డెట్లుండవలయు? నిరంతరసంతోషాంబుధి నోలలాడుచు హెచ్చఱిక నొప్పవలయు. విసుగు, కోపము, మత్సరము మున్నగునవి లేక చుఱుకుఁదనము నెఱపుచు నెప్పుడు తనపెదవులపై మొలకనగవుల నటింపఁజేయుచు దనకనుఁదోయిఁ బ్రేమమోహనము లగుకడగంటిచూపులఁ బ్రసరింపఁజేయుచుఁ దనయువయవసౌష్ఠవంబున కనువగుతీరు నందగించునుడుపుల ధరించుచు, మదవతులకు విందొనర్చుచు, ముదుకుల కానందమొసంగుచు భావివికాససముత్సుకుఁడై యిచ్చ వర్తింపవలయుఁ గదా!

కాని పురుషసింహుఁ డేలకో మోము వంచి ఖిన్నమనస్కుఁ

డై యుండెను. ఆందోళన మంతకంత కతనిఁ బరవశునిసేయ నేమే మియో యోచించుచుండెను. అతఁడు తనయింటివీథియరుఁగుపైఁ గూర్చుండి యుండెను. ఆవీథి యొక్కింత కడయగుటచే జను లెవ్వరు నడచుటలేదు. వీథికిఁ బురుషసింహునియి ల్లున్నప్రక్కనే యిం డ్లున్నవి కాని రెండవప్రక్క నిండ్లు లేవు. ఊడ్చిన కేదారములు మూవఁ దిఱిగి పచ్చగ నావ్రిక్క నస్తమయదిఙ్మండలపర్యంత మేకఖండమై కనుపండువోనర్చుచున్నవి. వీథికిఁ బోలమువైపున నొకతిన్ననికాలువ దాపున ప్రోసి పొలములకలింగలవఱదచే గట్టులు మోసి ప్రవహించుచున్నది. పొద్దుముదసలి మోము సంజమొగుళ్లముడుతలం బడి నిరస్తతేజోవిభవమయి తనవై పెల్లఱు పెడమోము వెట్ట నప్పుడే గుంకినది. ముం దక్కడక్కడ చెదరికనఁబడుతుమ్మచెట్లను, చింతచెట్లను, మామిడిచెట్లను, మిక్కిలి నలుపులుగఁ జేసి, క్రమక్రమమున బలిసి మునిచీఁకటి పంటబయలునంతను వ్యాపించి విషాదమిచ్చుచుండెను.

స్వభావసిద్ధముగాఁ బురుషసింహుఁ డపూర్వదయాంతరంగుఁడు. ఒకబిచ్చగానిఁ గాని యొకయాపన్నునిగాని చూచినప్పు డనుకంపమువోడముట సాధారణముగా మానుషహృదయములకు సహజమే. పురుషసింహునిసరళహృదయార్ద్రభావ మన్ననో యద్దాని మేఱ మీఱె, యల్లనవీనభారతీయశాస్త్రజ్ఞప్రముఖుఁ డుద్ఘోషించినట్లు, ప్రతి ప్రమాకునందును ప్రతియాకునందును నాత్మసంచలనము గలదనినమ్మచు, సృష్టివిషాద మెందు దృష్టిఁబడినను దానికై పరితపించుచుండు. అయిన నాఁటిప్రదోషసమయ మెంతవిషాదమభినయించుచున్నను బురుషసింహునిమనస్సు గణిగించుట లేదు. అతనిస్వాంతంబున కనంతమైనవంత తగిలి యాతఁడు బోగులుచుండ నతనికన్యచింతానునయమొనర్చు టెట్లు సాధ్యమగు? లోలో నాతఁ డేద్దియో తలపోసి విలపించుచుండెను. తనజీవితగ్రంథంబున సౌఖ్యపత్రంబు దిప్పివేయఁ

బడిన ట్లతఁ డూహించుచుండెను. ఒంటరిగ నుండెను. కంటఁ దడిపెట్టుచుండెను. ఇంటఁ దన్నెవ్వ రూఱడించువారు మఱిలేనట్లుగ వెక్కివెక్కి తనలోనఁ దా నెడతెగనియెగుపుల వగచుచుండెను.

అక్కటా! యట్టితఱి నతని కెట్టికట్టఁడియిక్కట్టాపాదించియున్నదో యని యడుగనైనఁ గడ నేరును లేరు. ఎంతవఱకు దుఃఖములు కంఠస్థములై యుండఁగలవు? తుద కొక్కముహూర్తమాత్రమున కతఁడు బొటబొటనురలుకన్నీరు పైనంగవస్త్రమున నొత్తుకొనుచు దీర్ఘతరనిశ్వాసంబుఁ బుచ్చి, పెదవులప ట్టెడలించి యిట్లని యాత్మగతంబున నెంచఁదొడంగె. "కటకటా! యెంతో యాసక్తిమై నేను బట్టనంబునఁ బరుసింట నెట్టెట్లో కూడుకుడుచుచు, విద్యనభ్యసింపఁదలంచుకొన్నను దైవము గొనసాగింప నెంచఁడయ్యె. నిరుడు ప్రవేశపరీక్షకుఁ గూరుచుండి సఫలుండ గానైతిని గానని యెంచుకయు వెనుదీయక తదేకధ్యానమున నీసంవత్సరమైనఁ జదివి కృతార్థుఁడను గాఁదలంచుచుఁ దిరిగి పాఠశాలఁ బ్రవేశించితిని. దైవమా! యింతలోనే యీగడవనేరనివిచారసాగరంబున నన్ను ముంపవలయునా? నాకు వెనుక సమస్తమైయున్నజనకు నింతలోనే నీకడకుఁ గొనిపోవలయునా? ఇంట నీపైని నాతల్లిని నవివాహితయగునాసోదరిని దిగవిడిచి యొక్కరుండను బట్టనవాసంబునఁ జదువఁగలనా? అప్పుడే యమ్మ, "తండ్రి కరిణీకమును జూచుకొనుచు వయస్సువచ్చుటచేఁ జక్కఁగ నాయుద్యోగమునే నిర్వర్తించుచు నింక మనగ్రామముననే మమ్ములను గని పెట్టుకొనియుండుము తండ్రీ" యని యొప్పఁజెప్పుచున్నది. కష్టములో నున్నయీపెయిష్టము నెరవేర్పక మదభీష్టార్థ మెట్లు పెరచోటికిఁ బోఁగలను. ఇఁక విద్యయా సున్న! ఈవివిక్తంబులైనపల్లెలం బడియె నాయెల్లబ్రదుకు బ్రదుకవలయును. నే నొకనితో నిద్దానిఁగూర్చి యోజించి వారియభిప్రాయములఁ గొందమనుకొన్నఁ గావలసినవా రొక్క

రు నగుపడరు. ఉన్నవాఁ డేటికి నామామగారు? ఆయన తనపట్టన వైభాగ్యంబున న్యాయవాదిపదవియనుతూఁగుటుయ్యాలఁ దులఁదూగుచు మాబోంట్లఁ బల్లెటూరివారలుగ నిరసించునే కాని, తన కల్లుఁడయ్యె, వీనిబా గరయువలయునని యుల్లంబున నేకోశంబునను దలపోయఁడు కదా! ఏమో పిల్ల నిచ్చె. బందుగులపట్టుచేతనో మాయమ్మకు భయపడియో, అప్పటి కింకఁ దన కంతయైశ్వర్యము పట్టమియో నాకాళ్లు గడిగి తనకుమారితెను ధారవోసెను. అంతియే కాని నేనల్లుఁడనని నాతల్లి తనసహోదరియని యించుకంతమనస్సున నతని కున్నదే? మగఁడు చచ్చి చిచ్చుఁబడియున్నతీరు మూలఁబడి తోబుట్టువు గోలుగోలున నేడ్చుచుండ నిప్పుడిఁక వచ్చి చేసెడిదేమి? పదిపదునొకండవదినంబునకు వచ్చుచుంటినని యాతఁడు వ్రాసిపంపెను. ఎట్టి సహోదరన్యాయము! ఇంకను రాలేదు. వచ్చునేమో రేపో మాపో?" అని యనుకొనుచుఁ దండ్రిపోయినవిచారమెల్ల మామగారిపైఁ దెచ్చి నరోషముక్రింద మాఱఁ బురుషసింహుఁడు లేచి యిటునటుఁ జూచి "ఏమే, చెల్లాయీ! ఇంకను వీధియరుఁగుపై దీపముపెట్టినదానవు కావు" అని యని యరుఁగుగోడగూటిలో నున్నయాముదపుఁబ్రమిదెను వత్తి కొడె నలుపుచు లోనికిఁ గొనిపోయి వెలిఁగించుకొనివచ్చి వీధిలోఁ బెట్టుచుండెను. అప్పుడే పెఱటివైపున నున్నకమ్మవారియింటికిఁ బెఱుగునకుఁ బోయి చెల్లెలు తిరిగివచ్చి వీధిద్వారబంధమునంటి "అన్నయ్యా! వంటయైనది. మడిఁ గట్టుకొనవచ్చునని చెప్పి కాళ్లు గడుగుకొనుటకు జెంబునునీళ్లును, తుడుచుకొనుటకుఁ దడిగుడ్డను తీసికొనివచ్చి యక్కడ పెట్టి లోనికి వెడలెను. పురుషసింహుఁడును భోజనమునకు లేచుతలంపుతో ముంగిలిఱాతిమెట్టుపైఁ గాళ్లు కడుగుకొనుచుండెను.

## ద్వితీయాధ్యాయము.

పరామర్శ.

పురుషసింహుఁ డట్లు వీథిలోఁ గాళ్లుగడుగుకొనుచుండఁగనే పెరటిగుమ్మముకడ నెవ్వారిదో బండి యాఁగినట్లును, పెరటితలుపు తట్టినట్లును నయ్యెను. అది వినునంతఁ గాళ్లుతుడుచుకొనుచు, 'చెల్లాయీ! ఎవ్వారో వచ్చినట్లున్నారు. పెరటితలుపు తీయవే' యని పురుషసింహుఁడు నిట్టూర్పుఁ బుచ్చుచుఁ దడిగుడ్డను మోముదుడుచుకొనుచు 'ఎవ్వరో బంధుగులు పరామర్శింపవచ్చిన ట్లున్నారు. అమ్మగుండియపగులఁ బవలెల్ల విలపించినది. ఇప్పుడుగూడ తప్పదు గాఁబోలు' నని యనుకొనుచు లోపలిచావడిలోని కడుగిడెను. పెరటితలుపుఁ దీయుచు బాలికయు గగ్గోలుపడి యేడువఁదొడంగె. దాన లోన మూలమిద్దెగదిలోనుండి యొకయేడ్పు విననయ్యె. "ఎవ్వరు వచ్చిరో యేమిటో యేదియుఁ జూడకుండ చెల్లాయీ! అట్లు బేలవై యేడ్చెదవేమే" యని పురుషసింహుఁడు చావడివెనుకవసారాలోనికి వెళ్లి చూడఁ బురుషసింహునిమామగారు ముందును, నావెనుకఁ జీరచెఱంగునఁ గంటఁ దడినొత్తుకొనుచుఁ బురుషసింహునియత్తగారును నాయిద్దరివెనుక మోమువంచుకొని యొంసిలి పురుషసింహుని భార్యయును వసారా నెక్కుచుండిరి. ఎంతదృఢచిత్తులకైనను బరామర్శసమయములయందు విచారము రాక తప్పదు. పురుషసింహుఁడు తనధైర్యము నాఁపుకొనఁజాలక వసారాస్తంభము నానుకొని పొరలిపొరలివచ్చుదుఃఖతరంగంబులఁ గటకటంబడుచు నింతసే పేడ్చెను. ఇట్లీవల వీర లేడ్చుచుండ లోపలఁ దల్లి మఱింతగా నేడ్వసాగెను. ఆపెకడకు నత్తగారు

ను భార్యయుఁ, జెల్లెలును వెళ్లి యోదార్చుచు నాఁపఁజాలనియాదుఃఖమున కడ్డుపడఁబోయి వారును దుఃఖపరవశులైరి. మామగారును బురుషసింహుని “ ఏటికబ్బాయీ! విచారించినఁ గార్య మింకేమికలదు? పెద్దలు తండ్రిగారు పోయిరి. చిరకాలము జీవింతురా? నీ వింకను గొంచెము పెద్దవాఁడ వగువఱకు జీవించియుండిన బాగుగనుండును. మఱి కాని దైవ మట్లు తలపోయలేదు” ని వానిని మెల్లనఁ జావడిలోనికిఁ దీసికొనివచ్చి బల్లపైఁ గూరుచుండఁబెట్టి ప్రక్కఁ దారును గూరుచుండి విచారమగ్నులైనతోబుట్టువును మేనగోడలిని ననునయింపసాగిరి.

కొంతసేపున కాదుఃఖదవానలంబు తనంతనే చల్లాఱెను. సమస్తము నిశ్శబ్దమయమైనట్లు డోఁచెను. కాని యింతలోనే వా రిట్లు మాటలాడుకొనఁజొచ్చిరి.

మామగారు—“ అక్కయ్యా! బావగా రింకను బ్రదుకువారని తలంచితిని గాని యింతలో మృతినందుదురని యనుకొనలేదే?”

తల్లి—“ తమ్ముఁడా! మే మందఱము నట్లే యనుకొంటిమి. కాని యి దెక్కడిరోగమో ముంచుకొనివచ్చినది.

అత్తగారు—అయినను, అన్నగారికి మొదటినుండియుఁ గొంచెము నంజుచూపెడిగుణమున్నది.

తల్లి—అది చాలకాలమునుండి యున్నదమ్మా! వదినా! దానివల్లనే పోయినారని యనుకోనేల? నాకర్మవశము. నానుదుట, నిట్లు విధవఱిక మనుభవింపుమని వ్రాసి విధించియుండ—” అని కంటఁ దడి వెట్టసాగెను.

పురు—“ అమ్మా! ఇఁక మఱలమఱల నూరకే యేడ్చినఁ బ్రయోజనం బేమి? ఇక్కడకుఁ బదినాళ్లనుండి యొక్కరీతిగ నెత్తినోరు

కొట్టుకొని యెచ్చిన వచ్చినవాఁడా నాతండ్రి" యని విచారభేదిత హృదయానుకంపితగద్గదకంఠుఁడై తల్లి నోదార్చుచు మామగారితో "మామగారూ! ప్రయాణముచేఁ జాల నలసి వచ్చినట్లు తోఁచుచున్నది. ముందు భోజనాదులు గావించి మఱి తక్కినవి యోజింతము. నిజముగా దిక్కులేనివారివలెనే యీగ్రామములో నీమూలయింటిలోఁ గాపురముండి యెట్లు కర్మదినములు గడపినాయని చింతించుచుంటి" నని, చెల్లెలితో "చెల్లాయీ! త్వరలో పీటలు విస్తళ్లు వేయవే" యని తొందఱచేసెను.

అతనిపలుకులచే నత్తగారును భార్యయును జెల్లెలును వంటింట భోజనమమర్ప వెడలిరి. ఇంటిలోనివారి కింకను నశుచికడవమిఁ బురుషసింహునియత్తగారు తమకొఱకు మడిఁగట్టుకొని స్వయముగా వంటఁజేయవలసివచ్చెను. అది గ్రహించి పురుషసింహుఁడు మామగారిని "నొక్కనిముసము వీథియరుగుమీఁదఁ గూరుచుందము రండి" యని పిలుచుకొని యరుగుపైనున్నతుంగచాఁప దులిపి కొంచెము గోడదరికి సరిగ జఱిపి యిరువురును గూరుచుండిరి.

కట్టెదుటఁ జీఁకటి యయోమయము. ఒకింత వెలుతురుమాత్రము గూటిలోనియాముదపుదీపము వాఁకిటఁ ద్రోవఁ గనుబఱచుచున్నది. దాని కవలఁ గన్నుకన్నుఁ గనఁబడదు. మిన్నుపైఁ జుక్కలున్నను, గలిసి పెరిగినయొక రావిచెట్టువేఁపచెట్టు నావీథి నాయింటిముందుఁ గప్పి చీఁకటిరాత్రుల మఱింత చీఁకటి యుండునటుల చేయును. వేసవి నాచెట్లచల్లదనము వేనోళ్ల గ్రామస్థులును, దెఱువరులును గొనియాడుదురు గాని రాత్రులందు నవ్వాని నొకానొకభీతి నెంతురు. ముందుఁ బంటకాలువ కారిరులనైన నాత్మీయమర్మరధ్వని విడక ప్రవహించుచున్నది. ఏదియో.కుమ్మఱిపుర్వొండియుండి 'కీచు కిట్టు' శబ్దము

చేయుచున్నది. పురుషసింహుఁడుగారిసరిహద్దుగోడపైకి వేసినప్రక్కరయితుదూడలపాకలోనిపశువులు నడుమనడుమదోమలబాధఁ దోఁకలు విసరుకొనుచు నొకవిధమగునసహానమును వెల్లడించునిట్టూర్పులు పుచ్చుట వినవచ్చుచుండెను. తదేకాంతజానపదనిశప్రతిష్ఠితంబగునంధకారమెల్లఁ బట్టనపుసందడిమసలున్యాయవాదికిఁ గ్రొత్తగఁ బొడగట్టుచుండెను. ఆయన కేమియుఁ దోఁచుటలేదనుకొని పురుషసింహుఁడు ‘ ఇట్లే యుండును. మామగారూ! పల్లెలు—ఈసరికి మీరింకను బురమందిరంబునఁ గ్రీడావినోదంబులనో యన్యోన్యవార్తాపత్రికాసల్లాపంబులనో ప్రొద్దుఁబుచ్చుచుందురని యనుకొందున’’ ని యనియె. దానికి మామగారును దలయూఁచి “ ఏమోయి! చుట్టుపట్ల నిల్లేమియు బొత్తిగా లేనేలేవా యేమి? వెనుక నెప్పుడో వచ్చినప్పు డొకటిరెండుండెడివే. ఎక్కడను మనుష్యసంచారమే లేద’’ ని యడిగెను. దానఁ బురుషసింహుఁడు “ మీరు వెనుకవచ్చినప్పుడు మాయింటి కాప్రక్క వైష్ణవు లొకరుండెడివారు. వారిప్పుడు పాపము! ఆయింటియజమాని పోఁగానే యిల్లుపాడువెట్టి యెక్కడికో వెళ్ళినారఁట. అయినను గ్రామమందు జనసంఖ్య తక్కువ. ఉన్నవాళ్లందఱు వ్యవసాయదారులు. ఈసమయమున వాళ్లందఱును భోజనములు చేయుచుందురు. అంతియ కాక యున్నవీథులన్నిఁటిలోను నీవీధిని సందడి తక్కువ. మా తండ్రిగారున్నప్పుఁ డెవ్వరైనను వచ్చుచుఁ బోవుచుండెడివా రిప్పుడదియు లేదు. మఱియును బల్లెటూరివాండ్ర కెక్కడలేనిమూఢవిశ్వాసములును. మనయింటిముం దవిగో! పొద్దున స్పష్టముగాఁ గనుపించును. ఆ రావిచెట్టును, వేఁపచెట్టును ననాదిప్రసిద్ధములుగాఁ జెప్పుచు వానిపై దయ్యములున్నవని నమ్ముచుందురు. వానిని ‘ దయ్యాలరావి. దయ్యాలవేఁప.’’ యని ప్రత్యేకనామములఁగూడఁ బిలుతురు.